చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

నిజామాబాద్
శుక్రవారం
25.04.2025

సంపుటి : 15 సంచిక: 226
పేజీలు: 8 వెల: రూ.2

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రాజస్తాన్ బోల్తా.. బెంగళూరు విజయం

మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రాజస్తాన్ బోల్తా పడింది. ఎప్పటిలాగానే ఒత్తిడి తలొగ్గి పరాజయం పాలైంది. చివరి వరకు పోరాడి ఓడిపోవడం రాజస్తాన్‌కు వరుసగా ఇది మూడోసారి. ఇక, ఎట్టకేలకు స్వంత మైదానం అయిన బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెరిసింది. ఈ సీజన్‌లో స్వంత మైదానంలో ఆర్సీబీకి ఇదే తొలి విజయం. కింగ్ కోహ్లీ (70) మరోసారి చెలరేగడంతో పాటు దేవ్‌దత్ పడిక్కళ్ (50) హాఫ్ సెంచరీ చేయడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 194 పరుగులు మాత్రమే చేయగలిగింది. టాస్ గెలిచిన ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఆర్సీబీ బ్యాటింగ్‌కు దిగింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో ఆర్సీబీ బ్యాటర్లు చెలరేగారు. కోహ్లీతో పాటు ఫిల్ సాల్ట్ (26) కూడా వేగంగా ఆడి తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హసరంగా బౌలింగ్‌లో సాల్ట్ అవుట్ అయిన తర్వాత వచ్చిన పడిక్కళ్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. కోహ్లీ, పడిక్కళ్ రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించారు.

# ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టం

- కలలోనూ ఊహించని విధంగా వెతికి మరీ శిక్షిస్తాం
- పహల్గాం ఘటనకు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు
- ప్రధాని నరేంద్ర మోదీ వార్నింగ్



**చట్టం, పాట్నా:** ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. మొదట తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. 'ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. గాయపడ్డవారిని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం' అని మోదీ అన్నారు. 'పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారు' అని ప్రధాని గట్టిగా హెచ్చరించారు.

**భారత ఐక్యమత్యాన్ని దెబ్బతీయలేరు..**

భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. 'మానవత్వాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదు'అని మోదీ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ సక్సెస్ అయితది

- కేసీఆర్ కోసం జనం ఎదురుచూస్తున్నరు
- సభకు భారీగా తరలివచ్చే చాన్స్ ఉన్నది
- కంచ– గచ్చిబౌలి భూముల ఇష్యూలో స్మితా సభర్వాల్ రీట్వీట్ లో తప్పేం లేదు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన కామెంట్స్



**చట్టం, హైదరాబాద్:** ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించబోయే సిల్వర్ జూబ్లీ సభ సక్సెస్ అవుతుందని ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కేసీఆర్ ను చూసేందుకు ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని, సభకు భారీగా జనం వచ్చే అవకాశం ఉందన్నారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని దానం పేర్కొన్నారు. గురువారం హిమాయత్ నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీ రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నారాయణగూడ కమ్యూనిటీ హాల్ లో వాటర్ బోర్డు, ఇతర శాఖల అధికారులు, శానిటేషన్ కార్మికులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. హెచ్ సీయూ భూముల ఇష్యూలో సీఎస్ శాంతి కుమారిపై సుప్రీం ధర్మాసనం సీరియస్ అయిందన్నారు. ఒక మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న శాంతికుమారికి ఈ పరిస్థితి రావడం బాధగా ఉందన్నారు. కంచ - గచ్చిబౌలి భూముల వివాదంలో ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సభర్వాల్ చేసిన రీట్వీట్ లో తప్పేం లేదన్నారు. అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితినే ఆమె రీట్వీట్ చేశారన్నారు. ఆమె చేసిన పనిలో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఏమీ లేదన్నారు. అభివృద్ధి, శానిటేషన్ విషయంలో జనాలకు అసౌకర్యం కలిగిస్తే చూస్తూ ఊరుకోనని దానం నాగేందర్ హెచ్చరించారు. శానిటేషన్ కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేస్తున్నారని.. అలా కాకుండా వారు ఉండే ఏరియాల్లోనే విధులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## నేటి నుంచి హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

- వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**చట్టం, హైదరాబాద్:** భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. నేటి నుంచి జరిగే ఈ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ గురించి వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని ఆయన తెలిపారు.

## పాకిస్థాన్‌తో మ్యాచ్ లు ఆడేదే లేదు

- కేంద్రం ఏం చెబితే అదే చేస్తాం
- ఉగ్రదాడికి గురైన కుటుంబాలకు అండగా ఉంటాం
- బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా



**చట్టం, స్పోర్ట్స్:** పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత క్రికెట్ బోర్డు మరో స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుంది. భవిష్యత్తులో ఎప్పుడూ పాకిస్థాన్‌తో సిరీసులను ఆడబోమని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. 2012-13 నుంచి ఇప్పటివరకు టీమ్‌ఇండియా పాక్ గడ్డపై అడుగుపెట్టలేదు. కేవలం ఐసీసీ ఈవెంట్లలో ఇతర వేదికలపైనే తలపడుతోంది. ఐసీసీ నిబంధనలు పాటించడం కోసమే బీసీసీఐ తన జట్టుకు అనుమతిస్తోంది. ఇదే విషయంపై ఐసీసీ ఆలోచన చేయాలన్నట్లుగా రాజీవ్ శుక్లా పరోక్షంగా సూచించారు. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఇరు దేశాలు తలపడ్డాయి. ఆ సమయంలో పలువురు మాజీ క్రికెటర్లు భారత్ -పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఉంటే బాగుంటుందని సూచించారు. ఇప్పుడు బీసీసీఐ క్లారిటీ ఇవ్వడంతో అలాంటి ఆలోచనలకు తెరపడినట్లే. 'ఉగ్రదాడికి గురైన బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే అదే చేస్తాం. ఇప్పటికే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను ఆడటం లేదు. ముమ్మందూ ఆ జట్టుతో ఆడే ప్రసక్తే లేదని బలంగా చెబుతున్నాం. అయితే, ఐసీసీ ఈవెంట్ల విషయానికొచ్చేసరికి.. ఐసీసీని గౌరవిస్తూ తటస్థ వేదికలపై ఆడుతున్నాం. ఇప్పుడు దేశంలో జరిగిన దానిపై ఐసీసీకి అవగాహన ఉందనుకుంటున్నా' అని రాజీవ్ శుక్లా వెల్లడించారు.

**ఐపీఎల్ మ్యాచుల్లో సంతాపం..**

పహల్గాం ఘటనను ఇప్పటికే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఖండించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ - ముంబయి ఇండియన్స్ మ్యాచ్ సమయంలో సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా ఎలాంటి సంబరాలు లేకుండా మ్యాచ్‌ను నిర్వహించారు. 'జీవితాలు కోల్పోయిన అమాయక ప్రజలకు అండగా నిలుస్తాం. ఈ ఘటన గురించి తెలియగానే క్రికెట్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది.

## సోకాల్డ్ సెక్యులర్ మేధావులు నోరు విప్పండి

- భారతదేశంపై మీకు ప్రేమ లేదా?
- ఉగ్రవాదులపై మోదీ సర్కారు స్ట్రాంగ్ యాక్షన్ తీసుకుంటది
- తెలంగాణను ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తున్నది
- ఆలయాల మీద దాడులు జరిగితే చూస్తూ ఊరుకోం
- మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం



**చట్టం, సిద్దిపేట:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఖండించారు. ఈ సందర్భంగా అమరులకు ఆయన సంతాపం తెలిపారు. తీవ్రవాదుల చర్య దుర్మార్గమైనదని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ ఆఫీసులో రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27 మంది టూరిస్టులను ఉగ్రవాదులు దుర్మార్గంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడల్లా దేశంలో అలజడులు జరుగుతున్నాయని ఆరోపించారు. జమ్మూ కశ్మీర్‌లో తెలంగాణకి చెందిన 150మంది పర్యాటకులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనపై సోకాల్డ్ సెక్యులర్ మేధావులు ఎందుకు నోరు మెదపడం లేదని.. వారికి దేశం పట్ల ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. స్టాలిన్, కమల్ హాసన్, ప్రకాశ్‌రాజ్ ఎందుకు జమ్మూ కశ్మీర్ ఘటనపై నోరు మెదపడం లేదని.. ఈ దేశంపై మీకు ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. టెర్రరిస్ట్ సంస్థలపై మోదీ ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబర్ట్ వాద్రా బీజేపీపై బురదజల్లటం మానుకోవాలని.. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఒవైసీ పేద ముస్లింల కోసం ఆలోచించడం లేదని చెప్పారు. డెవలప్‌మెంట్‌కి ముస్లింలను దూరంగా ఉంచేది ఏంఐఎం పార్టీ అని విమర్శించారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో జరుగుతున్న సంఘటనలు బాధాకరమని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

**శాంతి భద్రతలకు విఘాతం..**

ఒక వర్గానికి చెందిన కొంతమంది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మదర్సాల గురించి రేవంత్ ప్రభుత్వం ఆలోచించాలని చెప్పారు. తెలంగాణను ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హిందూ ధర్మం పరమత సహనాన్ని పాటించమని చెబుతోందని అన్నారు. హిందూ దేవాలయాల మీద దాడులు చేస్తే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో ప్రస్తుతం లేరని అన్నారు. మతం పేరిట జరిగిన దాడులను హిందువులు ఖండించాలని.. ఆలోచించాలని చెప్పారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మదర్సాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతాం

- అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ
- టెర్రరిజంపై పోరులో ప్రభుత్వం వెంటే ఉంటామని అన్ని పార్టీల నేతలు చెప్పారు
- పహల్గాం ఉగ్రదాడిని ముక్త కంఠంతో ఖండించాం: రాహుల్
- కశ్మీర్ లో శాంతియుత పరిస్థితుల కోసం చర్యలు చేపట్టాలి: ఖర్గే
- పార్లమెంట్ ఆవరణలో రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన ఆల్ పార్టీ మీటింగ్
- హాజరైన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షుడు ఖర్గే



**చట్టం, ఢిల్లీ:** ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. 'జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు' అని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు.

**కేంద్రానికి పూర్తి మద్దతు ఇస్తాం..**

పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించామని.. కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చామని రాహుల్ గాంధీ తెలిపారు. కశ్మీర్‌లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నామని.. ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని టీఎంసీ నేత ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ డిమాండ్ చేశారు.

## ఎండలు బాబోయ్ ఎండలు

- రాష్ట్రంలో హీటెక్కిస్తున్న టెంపరేచర్
- నేడు ఉత్తర తెలంగాణలో వడగాల్పులు వీచే చాన్స్
- రాత్రిపూట మరింత వేడి వాతావరణం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. మాడుపగిలేలా ఎండలు ఉండటంతో ఉదయం 8 దాటితే జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. మరోవైపు రాబోయే రెండ్రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే వీలుందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

**భానుడి భగభగలు..**

రాష్ట్రంలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వేడి గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచే భానుడు భగ భగ మండిపోతున్నాడు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న పరిస్థితి. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. 19 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయ్యాయి. ఈ జిల్లాలో 44 నుంచి 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మినహా రాష్ట్రమంతా ఆరెంజ్ అలర్ట్ జారీ అయ్యింది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలు జారీ అయ్యాయి. వడదెబ్బ మరణాలు మరింతగా పెరిగే ఛాన్స్ ఉందని.. అవసరం ఉంటేనే ప్రజలు బయటకు వెళ్లాలని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది.

## ఆపరేషన్ కర్రెగుట్ట

- చత్తీస్ గఢ్ లో అతిపెద్ద యాంటీ నక్సల్ ఆపరేషన్
- బీజాపూర్ అడవుల్లో దాక్కున్న వెయ్యిమంది మావోయిస్టులు
- ఫారెస్ట్ ఏరియాను చుట్టుముట్టిన 20 వేల మంది భద్రతా సిబ్బంది
- గురువారం జరిగిన ఎన్ కౌంటర్ లో ఆరుగురు నక్సల్స్ హతం
- భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కర్రెగుట్ట పరిధిలోని గ్రామాలకు రాకపోకలు బంద్
- మావోయిస్టు అగ్రనేత హిడ్మా టార్గెట్ గా కొనసాగుతున్న కూంబింగ్
- వరంగల్ లో పోలీసుల ఎదుట లొంగిపోయిన 14 మంది మావోయిస్టులు



**చట్టం, చర్ల:** చత్తీస్ గఢ్‌లో అతిపెద్ద యాంటీనక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. బీజాపూర్ అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. దాదాపు వెయ్యి మంది మావోయిస్టులను సుమారు 20వేల మంది భద్రతా సిబ్బంది చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ధర్మతాళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు తెలుస్తోంది. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది. కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.

**48 గంటలకుపైగా కూంబింగ్..**

గాలింపు చర్యల్లో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు చత్తీస్ గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. 48 గంటలుగా ఈ కూంబింగ్ కొనసాగుతోంది. మందుపాతరలు అమర్చామని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా ప్రకటించారు. ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా కొనసాగుతోంది. బుధవారం నాటికి 3 వేల మందితో కూంబింగ్ చేపట్టగా.. గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. దీంతో ఈ 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# ఆర్టీసీని నిండా ముంచిన మాజీ సీఎం కేసీఆర్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** కెసిఆర్ ప్రభుత్వం గత పది సంవత్సరాలు ఆర్టీసీ కార్మికుల శ్రమను దోచుకొని పని బారంతో ఆర్టీసీ కార్మికుల ఆత్మ అత్యాలకు గురిచేసి యూనియన్ నాయకులకు నోరెత్తకుండా చేసిన గులాబీ పార్టీ టి ఆర్ ఎస్ పార్టీని క్షమించే ప్రసక్తే లేదని అని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.అర్. రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో సమ్మె చేస్తే ఉద్యోగాలు పోతాయని బెదిరించి 33 మంది కార్మికుల ఆత్మ అత్యలకు కారకుడయ్యాడని 2017,2021 ఈ రెండు పి.ఆర్.సి.లు గత ప్రభుత్వమే ఇవ్వాలి.అది ఇవ్వలేక మొసలి కన్నీరు కారుస్తూ చలో వరంగల్ కు రావాలని మబ్య పెడుతూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అప్పుడే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసాము గవర్నర్ సహకరించడం లేదని కార్మికులను రెచ్చగొట్టి రాజభవన్ ను ముట్టడించేటట్టు చేసింది టి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అని తెలియచేసారు. విలీనం చేసినవాడు అపైంటెంట్ డే ఎందుకు ప్రకటించలేదని ఎద్దేవ చేశారు. కే.సి.ఆర్.కే.టి. ఆర్.హరీష్ రావ్,కవిత ఈ నలుగురు ఆర్టీసీ కార్మిక ద్రుహులే గులాబీల దొంగలే అన్నారు. టి ఎం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి టి అర్ ఎస్ సభకు రావాలని తప్పుడు ప్రకటన ఇప్పించారని ఆ ప్రకటన ఆయన చేయలేదని రాష్ట్రములో ఉన్న ఎ డిపో కార్మికులు ఈ ప్రకటన నమ్మవద్దని ఎవరు ఆ సభకు వెళ్ళవద్దని టి.ఎమ్.యు.ఏ రాజకీయ పార్టీకి అనుబంధ యూనియన్ కాదని ఏ ఆర్ రెడ్డి ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులు వదంతులు నమ్మవద్దని మే 7 న తలపెట్టిన సమ్మెకు యూనియన్లకు అతీతంగా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు



**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా బైంసా మండలం పరిధిలోని కుంసర గ్రామంలో గురువారం భారతరత్న విశ్వశాంతి ప్రపంచ మేధావి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరమ పూజ డాక్టర్ భీమ్రావు రాంజీ 134 వ అంబేద్కర్ జయంతి వేడుకలను కుంసార గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పంచశీల నీలి జెండాలను ప్రత్యేక పూజలు చేసి త్రిష పంచశీల వందన చేపట్టి సామూహికంగా తెలపడంతో అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా నేరుగా గ్రామంలో గల మరట యోధుడు మహారాష్ట్ర సామ్రాజ్య అధిపతి చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొందరు భక్తులు మాట్లాడుతూ.. అంబేద్కర్ కొందరివాడు అని అంటారు అది తప్పు అంబేద్కర్ అంటేనే భారత దేశంలో కాకుండా ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగ లిఖిత యోధుడు అని కొనియాడుతూ ఈరోజు ఆ మహానుభావుడు బహత్తరమైన భారత రాజ్యాంగ చరిత్ర రాయకపోతే ఎన్నో ఆర్టికల్ వలన మనం నష్టపోయి ఉండే వాళ్ళమని ముఖ్యంగా మహిళలకు పురుషులకు ఓటు హక్కు సమానత్వ హక్కును కల్పించిన వ్యక్తికి ఎంత కొనియాడిన సముద్రం లాంటి చరిత్ర కలిగిన అంబేద్కర్ యొక్క భావజాలను అందరూ కలిగి ఉండి బానిసలను విడి వారి యొక్క అడుగుజాడల్లో నడుస్తే అందరం బాగుంటమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ యువజన సంఘం అదేవిధంగా గ్రామంలో గల వివిధ సంఘ సభ్యులు గ్రామస్తులు గ్రామ పెద్దలు తాజా మాజీ సర్పంచ్ ఎంపిటిసి జెడ్పిటిసిలు మహిళలు బౌద్ధ ఉపసకులు ఉపాసికులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొనగా అనంతరం గ్రామంలో పురవీధుల గుండా అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టి శోభాయాత్రగా డిజె సౌండ్ మధ్య నృత్యాలు చేస్తూ శాంతి యుతంగా ర్యాలీ చేపట్టారు.

# ఘనంగా శ్రీ విజయ ఆర్యన్ ఫర్నిచర్స్ షోరూం ప్రారంభోత్సవం



**చట్టం, ఎల్బీనగర్:** బైరామల్ గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయ ఆర్యన్ ఫర్నిచర్స్ షోరూం ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రియా మోహన్ ఏర్పాటు చేసిన ఈ షోరూమ్ ను స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నటుడు అలీ భార్య జుబేదా అలీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బైరామల్ గూడ ప్రాంతంలో ఇంత పెద్ద ఫర్నిచర్ షోరూమ్ ను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకురాలు ప్రియా మోహన్ కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ప్రతి ఇల్లు, ఆఫీస్ విజయ్ ఆర్యన్ ఫర్నిచర్ తో నిండిపోవాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. నిర్వాహకురాలు ప్రియా మోహన్ మాట్లాడుతూ..తమ షోరూమ్ లో డైనింగ్ టేబుల్స్, సోఫా సెట్స్, బెడ్ రూమ్ సెట్స్ విత్ మ్యాట్రెస్, ఆఫీస్ ఫర్నిచర్, కుర్చీలు, వార్డ్‌రోబ్ మరియు డ్రెస్సింగ్ టేబుల్స్ వంటి ఇంట్లోకి కావలసిన అన్ని రకాల గృహోపకరణాలు లభిస్తాయన్నారు. తాము అందుబాటు ధరలలో నాణ్యమైన వస్తువులు అందజేస్తున్నామన్నారు. తమ వద్ద ఎక్కడా లభించని ఎక్స్ క్లూజివ్ ఫర్నిచర్ అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే వినియోగదారుల అభివృద్ధికి తగ్గట్లు తాము ఫర్నిచర్ తయారు చేసి ఇస్తామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా పలు ఉత్పత్తులపై 30% నుండి 50% వరకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. కావున పరిసర ప్రాంతాల ప్రజలు తమ షోరూమ్ ను సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకురాలు ప్రియా మోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# తానుర్ మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చట్టం, తానుర్ :** నిర్మల్ జిల్లా తానుర్ మండల కేంద్రంలోని గురువారం వ్యవసాయ మార్కెట్ గోదాం నందు మార్క్ ఫెడ్, పిఏసిఎస్, ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ముదురు నియోజకవర్గ స్థానిక శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. క్వింటాలు ధర రూ.3371 రూపాయలు ఉంటుందని రైతులు దళారులకు నమ్మి అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రజా ప్రతినిధులు రెవెన్యూ పంచాయతీరాజ్ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# షేక్ ముజాహిద్ కు ఘన సన్మానం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ముస్లిం ఏక్తా కమ్యూనిటీ సంఘం అధ్యక్షులు షేక్ ముజాహిద్ చేసిన సేవా కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎక్స్. డి సి సి వైస్ ప్రెసిడెంట్ అజార్ హుస్సేన్ ఘన సన్మానం చేశారు. ఇందులో భాగంగా మసూద్ ఎన్నారై, నజీర్ ఖాన్, విలేఖరి మోసిన్ , అసద్ జిలాని, సమద్ కాంప్లెక్స్ యజమాని ఆసిఫ్, జె.కె జివెల్లెర్స్ ఎజాస్ ఖాన్, తదితర సభ్యులకు కూడా పిలిపించి సన్మానం చేయడం జరిగింది. షేక్ ముజాహిద్ గ మాట్లాడుతూ.. అజార్ హుస్సేన్ ఇచ్చిన ఈ గౌరవాన్ని ఎప్పుడు మరువలేము ఇట్లనే సామాజిక సేవలు చేస్తున్న యువకులను ఎంకరేజ్మెంట్ చేసి ముందుకు తీసుకువెళ్లాలని కృతజ్ఞతలు తెలిపారు. అజార్ హుస్సేన్ గారు మాట్లాడుతూ.. ముజాహిద్ చేసిన సేవా కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి అందులో భాగంగా రక్తదానం టైలరింగ్ సెంటర్ కరుణ సమయంలో పేద ప్రజలకు ఆదుకోవడం జరిగింది. ఇప్పటివరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి నిర్మల్ ప్రజలలో మంచి పేరు సంపాదించిన షేక్ ముజాహిద్ కి ధన్యవాదాలు తెలిపారు.

# భర్తను చంపేసిన భార్య , అక్రమ బంధానికి అడ్డుగా భావించి హత్య

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మౌనిక
- ఇద్దరు నిందితుల అరెస్ట్ – బజాజ్ ఆటో, షికారు కత్తి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన పట్టణ సీఐ విజయకుమార్



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ హత్యకేసును పోలీసులు ఛేదించారు. తల్లిదండ్రులు, పిల్లల ముందు భర్తగా, ఇంటి గడపలో తన భార్యకు తోడుగా ఉండాల్సిన వ్యక్తిని, ఆమెనే హత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. భార్య ప్రియుడి సహాయంతో పతిని హత్య చేసిన మర్మాలు ఈ దర్యాప్తులో బయటపడ్డాయి. ఫిర్యాదు - మిస్‌యింగ్ కేసు ఫిబ్రవరి 24, 2025న రాత్రి 8 గంటల సమయంలో, ఫరూక్‌నగర్ మండలం చిన్నచిల్కమర్రి గ్రామానికి చెందిన ముద్దునోళ్ల మౌనిక అనే మహిళ, తన భర్త యాదయ్య (వయసు 32) ఫిబ్రవరి 19న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని, ఫోన్ కూడా ఇంటికే వదిలిపెట్టి వెళ్లాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు షాద్‌నగర్ పోలీసులు కేసు నెంబరు 205/2025గా మిస్‌యింగ్‌గా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**మిస్సింగ్ కేసు నుంచి హత్యవైపు మలుపు**

వివరాల్లోకి వెళ్తే, మౌనిక గత మూడేళ్లుగా రాఘవేంద్ర పత్తి కంపెనీలో పనిచేస్తూ ఆటోలో సరుకులు తెచ్చే కందివనం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎరుకలి అశోక్ (వయసు 31)తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం క్రమంగా అక్రమ సంబంధంగా మారింది. భర్త ఇంట్లో దురుసుగా ప్రవర్తించడం, మందు సేవించడం వల్ల విసిగిపోయిన మౌనిక, అశోక్‌తో కలిసి యాదయ్యను హత్య చేయాలని నిర్ణయించింది.

**ప్లాన్ ప్రకారం హత్య**

ఫిబ్రవరి 18న సాయంత్రం మౌనిక, అశోక్‌తో కలిసి భర్త యాదయ్యను 'దావత్'కి తీసుకెళ్తానని నమ్మబలికి ఆటోలో రాత్రి 11 గంటల సమయంలో పెద్దగట్టు తండా దాటిన తర్వాత నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించి, యాదయ్య మత్తులో జారుకున్న సమయంలో కత్తితో గొంతు కోసి హత్య చేశారు.అనంతరం శవాన్ని కాల్చి అక్కడే వదిలేసి, మౌనికను పక్కనే గ్రామంలో వదిలేసి అశోక్ అక్కడి నుండి వెళ్లిపోయాడు.అరెస్టుతో మిస్టరీ వీడింది అయ్యప్ప కాలనీలో కిరాయికి మౌనిక, అశోక్ కలిసి ఉండడాన్ని అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, విచారణలో నిందితులు హత్య జరిగిన తీరును ఒప్పుకున్నారు. పోలీసులు వారి నుంచి ఒక బజాజ్ ఆటో, షికారు కత్తి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**చాకచక్యంగా కేసు ఛేదించిన పోలీసులు**

ఈ కేసును శ్రీ కె. రామ్ కుమార్ (అతిరిక్త డీసీపీ, శంషాబాద్), ఏసీపీ రంగస్వామి, ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్ఐ సుశీల, హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్ నేతృత్వంలోని బృందం విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘనతకు పోలీస్ అధికారులకు ఉన్నతాధికారులు ప్రశంసలు అందజేసి రివార్డులు ప్రకటించారు.

# మరువరాదు మానవజన్మం మళ్ళీ రాదు ఇక ఈ జన్మం...



**చట్టం నారాయణఖేడ్ ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం సిద్ధాంగిర్గా గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో భాగంగా మహాతపస్వి పూజ్య శ్రీ డాక్టర్ బసవలింగ అవధూత మహారాజ్ (మల్లయ్య గిరి & దేగల్ మడి ఆశ్రమ పితాధిపతి) గ్రామం చిల్లపల్లి, కుప్పనగర్ మండలం ఝరాసంగం జిల్లా సంగారెడ్డి వారికీ ఘనంగా స్వాగతం పలికారు అనంతరం ప్రవచన కార్యక్రమంలో మాట్లాడుతూ... మరవరాదు మానవజన్మం మళ్ళీ రాదు ఇక మానవ జన్మం ఇప్పుడే తెలుసుకో ఈ జన్మం తెలియక పోతే మన కర్మం.. అర్థము చెప్పు.. మానవ జన్మము మంచి విలువలతో కూడినది ఆ బావవంతుడు మనకు ప్రతి సారి ఈ జన్మ ఇవ్వడు అందుకే ఇప్పుడు మంచి పనులు నలుగురికి మంచి చేసి ఆ భగవంతుడు ధ్యానం నామస్మరణ చేస్తుండాలి అన్నారు. ఇటువంటి సమయాలలో తెలుసుకోవాలి ఒకవేళ మనకు ఈ జన్మం గురించి తెలియక పోయినచో అది మన కర్మ అన్నారు. దిన నిత్యం భగవత్ ధ్యానం మనవరాదు గురు ఉపదేశం తీసుకోవాలి గురు మంచోడై ఉండాలి శిష్యుల కూడా మంచోడై ఉండాలి ఆ ఇద్దరి మధ్య కనెక్షన్ ఏ కలెక్షన్ ఆత్మ సంబంధం, ఈ శరీరంలో కేని గాలి అనేది వెళ్లిపోతే ఏమి ఉండదు అప్పుడు మనం సాధించేది ఏం ఉండదు చిన్న చిన్న గొడవలకు ప్రాణాలతో చెలగాటం ఆడుకోకండి మీ అన్న కన్నా మీ తమ్ముని కన్నా ఎంతోకొంత భూమి ఎక్కువన్న అయితది లేదా తక్కువన్నా అయితది మా అన్న నే కదా మా తమ్ముడే కదా అని వదిలేయండి పంచాయతీలు పెట్టుకోకండి. అందరు సమానంగా ఉండండి. సావ్కారి కాలం చేస్తే గరిబోడు మట్టికి పోండి, గరిబోడు కాలం చేస్తే సావ్కారి మట్టికి పోండి మంచి చెప్పే కాలం లేదు. జీవితంలో ఎన్ని సంపాదించిన మనతో పాటు ఏవి రావు పేరు ఒక్కటే వస్తుంది మంచి పేరు నలుగురికి దానం చేసే గుణం కలిగి ఉండాలి. గురువుకు గౌరవం ఇవ్వాలి తల్లితండ్రులు తరువాత మనకు మొదట గురువే ప్రత్యేక్ష్యదైవ స్వరూపం తల్లిదండ్రులకు అన్నం పెట్టాలని అన్నారు. అనంతరం భక్తులందరికి అన్నప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రవచన కార్యక్రమంలో సిద్ధంగిర్గా గ్రామ భక్తులు ప్రక్కన ఉన్న గ్రామాల భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష



**చట్టం, వరంగల్:** తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ బీఆర్ఎస్‌తోనే శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ కల్వకుంట కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటే.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్లు మాత్రమే కోరుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ది చేతగాని ప్రభుత్వమని ప్రజలకు తెలిసిపోయిందని, 16 నెలల పాలనలో 16 పనులు కూడా కాలేదని ఆరోపించారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను కవిత గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, ఓర్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలను ప్రజలు క్షమించరని అన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం 2001లో కేసీఆర్ పిడికిలి బిగించి ఉద్యమాన్ని మొదలుపెట్టారని గుర్తు చేశారు. ఒక చుక్క రక్తం చిందించకుండా శాంతియుత మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నవయువకుల కోసం జరుగుతున్నదని, సభకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ జరగబోతున్నదని చెప్పారు.

**మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు**

మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు వేశారని కవిత పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో, మారెట్ కమిటీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం, సూటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతిఒకరు సభకు రావాలని కోరారు. రైతులంతా గులాబీ దండులా కదలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్, చంద్రావతి, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, రజనీ సాయిచంద్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా పార్టీ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి రూపొందించిన 'భళే ఎగిసెర భళే ఎగిసెరా... సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచెరా' పాట సీడీని కవిత ఆవిష్కరించా రు. పాట రచించిన రిటైర్డ్ ఎమ్మార్వో మహమ్మ ద్ సిరాజుద్దీన్‌ను ఆమె అభినందించారు. భా రత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కోసం ప్రజల ఎదురు చూపు



**చట్టం, హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చే రిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సభ సక్సెస్ అవుతుందని, ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారని చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్‌ను చూడాలని ప్రజలంతా ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నరు. ఆయన ఈ సభ కు వస్తున్నారు కాబట్టి ఆయనను చూసేందుకు జనాలు పెద్ద సంఖ్యలోనే వస్తరని నేను భావిస్తున్న. కేసీఆర్ సభ సక్సెస్ అవుతదని అనుకుంటున్న' అని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బీఆర్ఎస్ సభపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. కేసీఆర్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి.

**వాస్తవాన్నే రీట్వీట్ చేసిండ్రు**

కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇవ్వడంపైనా దానం తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇందులో స్మితా సబర్వాల్ తప్పేమీ లేదని, అక్కడ జరిగిన వాస్తవాన్నే రీట్వీట్ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టు కూడా సీఎస్ శాంతికుమారిని హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎస్ శాంతికుమారికి తన సర్వీస్‌లో ఎలాంటి చెడ్డపేరూ లేదని, ఒక్క మచ్చలేకుండా సర్వీస్ అందించారని చెప్పారు. అలాంటి ఆమె ఇప్పుడు గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టుతో తిట్లు తినాల్సి వచ్చిందని వాపోయారు.

# శివ్వంపేట మండలానికి వన్నె తీసుకువచ్చిన పత్రాల శ్రీజ



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, సోదరుడు పత్రాల దేవేందర్ గౌడ్, కూతురు పత్రాల శ్రీజ, ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావడం జరిగింది. గత రెండు రోజుల క్రితం తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వెల్లడించిన ఇంటర్ సెకండియర్ ఫలితాలలో పత్రాల శ్రీజ 1000 మార్కులకు 990 మార్కులు సాధించి తన ఉత్తమ ప్రతిభను కనబరిచారు. అదేవిధంగా సుమారు 15 లక్షలకు పైగా వ్రాసిన జేఈఈ మెయిన్స్లో 91శాతం సాధించి జేఈఈ ఫలితాలకు సెలక్ట్ కావడం గొప్ప విషయమనే చెప్పవచ్చు . గతంలో కూడా పత్రాల శ్రీజ, పదవ తరగతి ఫలితాల్లో కూడా పదికి పది మార్కులు సాధించి అప్పటి తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,శ్రీజను అభినందిస్తూ సన్మానించడం జరిగింది. మండలానికి గుర్తింపు తీసుకువచ్చిన పత్రాల శ్రీ జ,ను నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ అధ్యక్షులు కల్లూరు హరికృష్ణ , మాజీ జెడ్పీటీసీ సభ్యులు పబ్బ మహేష్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు వై రమణ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,పత్రాల ప్రవీణ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజి పేట పద్మా వెంకటేష్ , పైనం, యాదగిరి ,పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు కూడా శ్రీజను ప్రత్యేకంగా అభినందించారు.

# చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించుకోండి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** చెక్ బౌన్స్ కేసులను రాజీ పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి అన్నారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బ్యాంకు అధికారులతో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని బ్యాంకులు, చిట్ ఫండ్స్ లలో నమోదై, పెండింగ్ లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీ మార్గాన పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పహాల్గాం ఉగ్రదాడిలో అమాయకుల మృతి పై ఆప్ పార్టీ నివాళి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** పహాల్గాంలో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై అమానుష దాడి జరిపి 26 మంది ప్రాణాలు కోల్పోయిన దారుణ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మరియు కన్వీనర్ శ్రీ దిద్ది సుధాకర్ గారు నిర్మల్‌లోని ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దాడికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని, ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే ఇలాంటి ఘోరమైన సంఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ గారు మాట్లాడుతూ.. ఈ దాడి కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల నష్టపరిహారం, గాయపడిన వారికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ మాజీ కోర్ కమిటీ సభ్యుడు సుభాష్ రాథోడ్, మంచిర్యాల ఇంచార్జి నయీమ్ పాషా, నిజామాబాద్ సీనియర్ నాయకులు జూనైద్, సమీర్, ముదోల్ నియోజకవర్గ ఇంచార్జి సూర్యనారాయణ, భైంసా డివిజన్ సెక్రటరీ హుజూర్ అలీ, సోఫీ ఇల్లియాజ్ , జహీర్, శ్రీనివాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం..తడిసి వరి ధాన్యం

**చట్టం, శివ్వంపేట :** కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యం అకాల వర్షం వల్ల పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు చెందిన రైతులు వరి పంటను కోసి ఎండకు ఆరబెట్టడం జరిగింది .అకస్మాత్తుగా గురువారం సాయంత్రం సమయంలో అకాల వర్షం భారీగా కురవడంతో వరి ధాన్యం కుప్పలు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు అప్పటికప్పుడు ఏమీ చేయలేక ప్లాస్టిక్ కవర్లు ,సంచులు కప్పినప్పటికీ భారీగా నష్టం వాటిల్లింది .దీంతో అనేక మంది రైతులు తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . శివ్వంపేట సహకార సంఘం పక్కన ఆరబోసిన ధాన్యం కూడా భారీగా తడిసి పోవడం జరిగింది. గత రెండు మూడు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వాన వల్ల కోతకు వచ్చి న వరి పంటలకు కూడా భారీగా నష్టం వాటిల్లింది. అకాల వర్షాలు ఎప్పుడూ కురుస్తాయోనని రైతులు అయోమయంలో ఉన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

CHATTAM NEWS



# భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేదుకు ప్రత్యేక సదస్సులు

▸ **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**చట్టం, నసురుల్లాబాద్ :** భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో, భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా గురువారం బిర్కూర్, నసురుల్లాబాద్ రైతువేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణీ స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసి క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్త ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఇంతే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసు పుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని,తెలిపారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. బిర్కూర్ గ్రామస్తుడు రవి మాట్లాడుతూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 228 లోని సమస్యను పరిష్కరించాలని కోరారు. సాయిబాబా మాట్లాడుతూ, పట్టాలు ఉండి భూమి లేదని, భూ భారతి ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతులకు చట్టాల గురించి ఈ ప్రభుత్వం తెలియజేయడం హర్షణీయం అని కిషోర్ తెలిపారు. నసురుల్లబాద్ గ్రామ రైతు నగేష్ మాట్లాడుతూ ప్రజల వద్దకు అధికారులు రావడం ప్రజాపాలన ప్రభుత్వమని అన్నారు. రైతుల సమస్యలు భూ భారతి తో పరిష్కరించాలని తెలిపారు. గంగారం మాట్లాడుతూ ధరణీ వలన పరిష్కారం.కానీ సమస్యలు భూ భారతి చట్టం తో పరిష్కరించాలని కోరారు. నసురుల్లాబాద్ మండల ప్రత్యేక అధికారి దయానంద్ మాట్లాడుతూ, రైతుకు భూమి యొక్క రికార్డులు బాగుంటే రైతు ధైర్యంగా ఉంటాడని తెలిపారు. ధరణీ వలన ఎన్నో కేసులు పరిష్కారం కాకుండా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో, తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, స్పెషల్ అధికారి దయానంద్, మండల వివిధ గ్రామాల రైతులు ప్రత్యేక అధికారులు రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## చర్యకు ప్రతి చర్య తప్పదు




**చట్టం, బోధన్ :** జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గ్రామ ప్రజలు, పెద్దలు, యువకులు, పిల్లల ఆధ్వర్యంలో క్యాండిల్ రాలిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇది పాకిస్తాన్ కుట్రపూరిత చర్యా అని ఈ చర్యకు ప్రతి చర్య ఉంటుందని తెలిపారు.

## ఉగ్రదాడిని నిరసిస్తూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** జమ్ము కాశ్మీర్లోని పెహల్గాం లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సిద్దిపేటలో మోడరన్ బస్టాండ్ వద్ద గురువారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గణాడి సంతోష్ కుమార్, శివకుమార్ మాట్లాడారు.. అమాయకులు 26 మంది పర్యాటకలను చంపడం సరైనది కాదన్నారు. ఇది కేవలం 26 మంది దాడి కాదని పూర్తిగా దేశంపై జరిగిన దాడిగా అభివర్ణించాలన్నారు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ పై చర్యలకు ఉపక్రమించడం శుభ పరిణామం అన్నారు. వెంటనే సర్జికల్ స్ట్రైట్ లాంటి చర్యలు తీసుకొని ఉగ్రవాదులను మట్టుబెట్టాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో భాజపా నాయకుడు శ్రీకాంత్, అసోసియేషన్ ప్రతినిధులు గణేష్, భరత్, కిరణ్, అరుణ్, శివ, రమేష్, శ్రవణ్, సతీష్, వెంకటేష్, రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అమరులకు నివాళి




**చట్టం, బీబీపేట్ :** జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గురువారం స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ ,దాడిలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో భారీ ర్యాలీ తీశారు. ర్యాలీ క్లబ్ నుండి ప్రారంభమై ప్రధాన వీధుల గుండా బయలుదేరి బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన చౌరస్తా వరకు చేరుకుంది .ర్యాలీలో యువకులు పాల్గొని పెద్ద ఎత్తున పాకిస్థాన్ ,బాంగ్లాదేశ్ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయలని ,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ కో ఆర్డినెటర్ బాశెట్టి నాగేశ్వర్ ,అధ్యక్షులు నాగేశ్వర్ ,కోశాధికారి రెడిశెట్టి నాగభూషణం ,మాజీ డిప్యూటి గవర్నర్ దుద్దేడ విశ్వప్రసాద్ ,ఉప్పల ఆనంతకుమార్ ,ఎర్రం ప్రసాద్ ,రెడిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పహల్గం అమరులకు నివాళులు అర్పించిన సిద్దిపేట జిల్లా మిత్రమండలి...



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** పహల్గం అమరులకు సిద్దిపేట జిల్లా మిత్రమండలి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ రాదారి నాగరాజు మాట్లాడుతూ.. దేశభద్రత ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని మనం ప్రభుత్వలకు అండగా నిలవాలి కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఫోరమ్ అధ్యక్షులు పూర్ణచందర్ రావు టి పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సమ్మయ్య సత్యం బాలస్వామి భాస్కర్ కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి తండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లింద్రులు నిత్యం అప్రమ త్తంగా ఉండాలి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లిమండల సబ్ ఇన్స్పెక్టర్ బి,అశోక్ మాట్లాడుతూ.. పిల్లలను ఎండలో తిరగనివ్వకుండా చూడాలి. తప్పకుండా తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలకు ఈత నేర్పించాలి. స్నేహితులతో మాత్రం ఈతకు పంపిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ద్విచక్ర వాహనాలు మాత్రం అసలే ఇవ్వొ ద్దు. వేసవి సెలవులు ఆనందంగా గడపాలంటే పిల్లలను నిత్యం తల్లిదండ్రులు పర్యవేక్షించాలి ఎస్సై ఎస్ఐ సూచించారు.

## రైతు శ్రేయస్సు కోసమే భూ భారతి చట్టం



**చట్టం, మెదక్ :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నూతన భూ భారతి ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం, జిల్లాలోని నిజాంపేట మండల కేంద్రం రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి , ఎంపీఓ ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలు అడిగిన పలు సమస్యలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందన్నారు. రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి, అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఈ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. భూ సమస్యలపై రైతులు మీసేవాలో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ధరణిలో అప్పీల్ చేయడానికి అవకాశం లేదని, సివిల్ కోర్టుకు వెళ్లాలని, ఈ భూ భారతి చట్టంలో తహసీల్దార్ నుంచి ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి ల్యాండ్ ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నా రు. ఈ నెల 29వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులను పూర్తిచేసుకుంటామని, మే 1వ తేదీన జిల్లాలోని ఒక మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించుకుంటామని, జూన్ మొదటి వారంలో ఈ భూ భారతి చట్టం జిల్లా మొత్తం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామ సభలు నిర్వహించి, రైతుల నుంచి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సదస్సులో ఇతర సంబంధిత అధికారులు, రైతు సంఘాల నాయకులు, సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ముదిరాజ్ అనీముత్యం తౌటి ప్రియాంక



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం పెద్ద లింగారెడ్డి పల్లి గ్రామంలో తెలంగాణ ముదిరాజ్ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన ముదిరాజ్ ఆణిముత్యం తౌటి ప్రియాంకను సన్మానించిన ముదిరాజ్ హక్కుల సాదన సమితి రాష్ట్ర యువత అధ్యక్షులు పడిగే ప్రశాంత్. ముదిరాజ్ ప్రియాంక ఎంపీసీ మొదటి సంవత్సరం 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. దీనిని ముదిరాజ్ సమస్త సమాజం గర్వించదగ్గ విషయంగా చెప్పుకోవచ్చు అంతేకాకుండా భవిష్యత్తులో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తెలంగాణ ముదిరాజ్ హక్కుల సాధన సమితి అండగా ఉంటుంది. అంతేకాకుండా వారికి విద్యలో ఏదైనా ఆర్థిక సహాయ సహకారాలు అవసరం ఉన్న మా వంతు కృషి చేస్తామని అన్నారు. ఒకప్పుడు ముదిరాజులు ఆర్థిక స్తోమతకు దిగువలో ఉండి తమ పిల్లలను చదువుపించుకునేటువంటి పరిస్థితి లేదు కానీ ఈనాడు కొంత మెరుగుపడి విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళుతున్నటువంటి పరిస్థితి ప్రభుత్వం ఇట్లాంటి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించి మరిన్ని ఉన్నత స్థానాలకు ఉన్నత విద్యకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రాజు. పిట్ల రాకేష్. రామస్వామి. జంగిటి స్వామి మరియు వారి తల్లిదండ్రులు తౌటి బిక్షపతి. లలిత. లింగం మరియు గ్రామస్తులు ఆరుట్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కర్రెగుట్టల వైపు ఉన్న మీ మనసులు మీ పాకిస్తాన్ వైపు మళ్ళించండి



**చట్టం, మెదక్ ప్రతినిధి:** కాశ్మీర్లో ఉగ్రదాడుల్లో పర్యటకులను విచక్షణ రహితంగా పాకిస్తాన్ త్రయోవాదులు కాల్చి చంపడం చట్ట వీరుద్దం భారతీయులను ప్రేమగా ఉంటున్నారని భావించి నమ్మించి మళ్లీ ఆర్మీలతో సహాయం తీసుకుంటూ చొరబడుదారులు ఎంతో మంది వస్తున్నారు బార్డర్ సెక్యూరిటీ వారి కండ్లుగప్పి స్థానికులతో సంబంధాలు పెట్టుకొని ఇండియాలోకి చొరబడుతున్నారు. అదేవిధంగా పర్యటకులను కాల్చి చంపడం సమంజసం కాదని చనిపోయిన వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర భీమార్మి కమిటీ తరపున ప్రగాఢ సంతాపం శ్రద్ధాంజలి తెలియజేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా మోడీ అమీషా కేంద్రం రక్షణ శాఖ మంత్రి మౌనంగా ఉండడం సమంజసం కాదని కేవలం తెలంగాణ మావోయిస్టులే ముఖ్యం ఢిల్లీ బార్డర్ ఫోర్స్ కర్రెగుట్టల వైపు మరలించడం సమంజసం కాదని పాకిస్తాన్ ఉగ్ర దాడులు ఎవరు చేస్తున్నారో ప్రజల ముందే తెలిసిపోయిందని వారిని నాశనం చేయి వారి పట్ల యుద్ధం ప్రకటించు అని అమిత్ షాకు మోడీకి తెలంగాణ బీమ్ ఆర్మీ మెదక్ జిల్లా కమిటీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. అనంతరం మెదక్ జిల్లా అధ్యక్షులు చేపూరి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కర్రెగుట్టల వైపు ఎలా మరణ హోమం సృష్టిస్తూరో పాకిస్తాన్ వైపు మరణ హోమం సృష్టించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

## ఇంటర్మీడియట్ లో తెలుగు తప్పక ఉండాలి




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ఇంటర్మీడియట్ లో తెలుగు భాష స్థానంలో సంస్కృతం ప్రవేశ పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం మానుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా చంద్రయ్య అన్నారు. గురువారం సాయంత్రం సిద్దిపేట శాఖా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిపాలన బాషగా ప్రతి కార్యాలయం తెలుగు భాషా ద్వారానే కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. అధికార భాష హోదా దక్కిన తెలుగును కళాశాల విద్యలో తొలగించడం ఎంతవరకు సబబు అని అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెళ్ళి రాజమౌళి మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నంతకాలమే మనకు గౌరవం దక్కుతుందని, ఇతర భాష వల్ల వెనకబడి పోతున్నామన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం మాట్లాడుతూ మార్కుల కొరకు నేడు సంస్కృతం ఇంటర్మీడియట్లో విద్యార్థులకు అనువుగా మారిందని, అందువల్ల తెలుగు భాషకు ముప్పు కలుగుతుందని, తెలుగు భాష గౌరవం దక్కాలంటే ఇంటర్మీడియట్లో ప్రతి ఒక్కరు తెలుగు చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా ఇట్టి విషయాన్ని ఎన్నోసార్లు ప్రస్తావించామన్నారు. తెలుగు భాష మూలంగానే అన్య భాషలకు గౌరవం దక్కుతుందన్నాడు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి బస్వ రాజు కుమార్, చీకోటి రాములు, వంగరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల హెల్త్ క్యాంప్ విజయవంతం చేయండి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేటలో ని నీలకంటేశ్వరాలయం కమ్యూనిటీ హాల్లో మే 1 గురువారం రోజున ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ సిద్దిపేట ఐఎంఏ డాక్టర్స్ ఆధ్వర్యంలో సిద్దిపేట లోని చేనేత కార్మికులకు హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆల్ ఇండియా ఫెడరేషన్ అధికార ప్రతినిధి రాపోలు జగన్ కన్వీనర్ వనం శాంతి కుమార్ తెలంగాణ శాఖ అధ్యక్షులు బాసబత్తిని రాజేశం రాపోల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సిద్దిపేట ఐఎంఏ డాక్టర్స్ గణేష్ డి ఆర్ కే సతీష్ డి ఆర్ డీ ఎన్ స్వామి డి ఆర్ ప్రణీత్ కుమార్ లు మాట్లాడుతూ.. చేనేత కార్మికులు చాలా మంది అనారోగ్యా సమస్యలతో బాధపడుతున్నావారూ ఈ హెల్త్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హెల్త్ క్యాంపులో గైనకాలజీ డెంటల్ ఐస్ జనరల్ ఎం డి డాక్టర్ లు అందుబాటులో ఉండి ప్రాథమిక రక్త పరీక్షలు ఈసీజీ ఇలాంటి పరీక్షలు నిర్వహించడమే కాకుండా రోగులకు సరిపడా మందులు ఫ్రీగా పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలకంఠ పద్మశాలి సంఘాల ప్రతినిధులు లోక లక్ష్మీరాజం కడవేర్గు నర్సింలు గుండ్ల యోగేశ్వర్ బూర మల్లేశం ముదిగొండ శ్రీనివాస్ కాముని రాజేశం చేర్యాల వెంకన్న కడవేర్గు శ్రీనివాస్ అబ్బత్తిని సురేష్ గుండ్ల జనార్ధన్ కాల్వ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో కీర్తన ఆణిముత్యం



**చట్టం, భూపాల్ పల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లామొగుళ్ల పల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన మాధారపు లావణ్య రంజిత్ దంపతుల కుమార్తె కీర్తన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో విజయ దుందుబి మోగించి 440 కి గాను 435 మార్కులు సాధించి చరిత్ర తిరగ రాసింది. జనగాం జిల్లా కొడకండ్ల టీ ఎస్ ర్ జే సి లో మొదటి సంవత్సరం పూర్తి చేసింది వారికి ఎల్లా రెడ్డి గ్రామంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ జిల్లా కన్వీనర్,చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ నిమ్మల భద్రయ్య లు చదువుల తల్లికి ఘనంగా శాలువాతో సన్మానించారు. చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్లో నీట్ పరీక్షలు అత్యధిక మార్కులు సంపాదించి కన్న తల్లిదండ్రులకు పుట్టిన గ్రామానికి పేరు తీసుకురావాలని కన్న తల్లిదండ్రుల కలలను సహకారాన్ని నిజం చేయాలని ఉన్నత శిఖరాలను ఎదిగి సమాజంలో సేవ చేయాలని కీర్తనను ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో మేకల ప్రవీణ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాసర నూతన ఎస్సైగా సంజీవ్ కుమార్



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని బాసర మండల కేంద్రంలో గురువారం నూతన బాసర సంజీవ్ కుమార్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన గణేష్ భైంసా టౌన్ కు బదిలీ కాగా వారి స్థానంలో సంజు కుమార్ బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ.. బాసరలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై శాఖపరమైన పట్టిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ముఖ్యంగా ఇక్కడ భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మ ఉన్నందున అన్ని విధాలుగా మా పోలీసు విభాగం నుండి సహాయ సహకారాలు అందిస్తామని మండల పరిధిలో గల గ్రామాలు అందరూ సహకరించాలని బెల్ట్ షాప్ గుట్కా మట్కా నిషేధిత విక్రాయాలను చేపడితే వారిపై కేసులు చేయడం జరుగుతుందని అందరూ శాంతియుత సన్మార్గంలో నడుస్తే మాకు ఆదర్శప్రాయంగా ఉంటారని అన్నారు.

## వెల్దుర్తి మండల కేంద్రంలో కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టంపై రైతు అవగాహన సదస్సు




**చట్టం, మెదక్ :** ప్రభుత్వం రైతులకు అనుకూలంగా ఉండే భూ భారతి తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆయన గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలో కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టంపై రైతు అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తుందని రెవెన్యూ శాఖ పక్షాన గతంలో ఉన్న ధరణి ద్వారా ఎలా నష్టం జరిగిందో ఇప్పుడు కొత్తగా భూ భారతి చట్టాని తీసుకొచ్చిందని అన్నారు. భూ భారతి చట్టంలో రికార్డుల్లో సవరణ చేయడానికి ఆప్షన్ ఉంది ప్రజా వాణి లో ధరణి లో తప్పు పడిన పేర్లు తొలగించే ప్రయత్నం చేసిన కాలేదు.. ఇప్పుడు తప్పుగా వచ్చిన రికార్డులు ఉన్న పేరు ఇద్దరిని పిలిచి నెల రోజుల్లో సమస్య పరిష్కారం చేయవచ్చు భూమి అంటేనే ఆత్మగౌరవం అలాంటి భూమి వివాదాల్లో ఉండడం తదితర అంశాల పరిష్కారానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. మ్యుటేషన్ ,రిజిస్ట్రేషన్ , ఫోర్జరీ , కబ్జా లాంటివి తహశీల్దార్, ఆర్డీవో,కలెక్టర్ స్థాయిలో అయిపోతుందని తెలిపారు. భూ రికార్డుల్లో ఎవరి పేరు ఉంది.. ప్రభుత్వ భూమి గా ఎలా మారింది,అసైన్డ్ భూమి గా ఎలా మారింది అనే దానిపై ఈ చట్టంలో అన్ని రికార్డులు పహాని తదితర కాపీలు తీసుకోవచ్చు అని సుదీర్ఘంగా వివరించారు.

## జిల్లా కలెక్టర్ మను చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కోర్ట్ పీపీ జీవన్ రెడ్డి



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి ని సిద్దిపేట జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పి పి)గా నియమితులైన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయి పంచి కలెక్టర్ ని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కోర్టు పి పి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా న్యాయం కోసం పోరాడే ప్రతి వ్యక్తికి న్యాయం జరిగే విధంగా దోషులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా చూస్తానని కలెక్టర్ కి హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా డిసిసి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి బైరీ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యక్షులు సిహెచ్ కనకయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## ఉగ్ర దాడి అమానుషం




**చట్టం, భూపాల్ పల్లి ప్రతినిధి :** కాశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడికి వ్యతిరేకంగా అమరులైన హిందూ పర్యాటకులకు అశ్రు నివాళులర్పిస్తూ హన్మకొండ జిల్లా గోపాల్పూర్ కళ్ళు మండువ దగ్గర గోపాల్ పూర్ లోని జాతీయవాదిలంతా ఏకమై ముక్త కంఠంతో దాడిని ఖండించి కొవ్వొత్తులతో సంఘీభావ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. పిరికిపందలైన ఉగ్రవాదులు ఉగ్రరూపం దాల్చి అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఈ దుశ్చర్యను దీనికి సహకరించే దుష్టశక్తులను అంతమందించడానికి దేశమంతా ఏకమై హిందువులంతా ఏకమై ఏక తాటిగా నడవాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టార్ టీచర్స్ అసోసియేషన్ బృందావన కాలనీ రెడ్డి సంక్షేమ సంఘం శ్రీనివాస కాలనీ సురేంద్రపురి కాలనీ అరుణోదయ నుండి పెద్ద ఎత్తున జాతీయవాదులు పాల్గొన్నారు. పరిపూర్ణాచారి బిల్ల రఘునాథరెడ్డి బద్దం సుదర్శన్ రెడ్డి కొండల్ రెడ్డి రాజేందర్ బాపు తిరుపతిరెడ్డి నర్సిరెడ్డి మహేందర్రెడ్డి ఆవుల విజయ్ కుమార్ రెడ్డి మహేందర్ రెడ్డి అమరేందర్ రెడ్డి వెంకటేశ్వర్లు దయాకర్ రెడ్డి శరవన్ లక్ష్మణ్ శంకర్ ఏకాంబరం అమరేందర్ రెడ్డి బండి హరీష్ ఇమ్మడి సందీప పద్మ అరుణ్ ఇంద్ర సేన రెడ్డి అనంతరెడ్డి మహిపాల్ రెడ్డి విజయ కుమార్ రెడ్డి సమ్మిరెడ్డి కామిడి సతీష్ రెడ్డి బాపిరెడ్డి సతీష్ రెడ్డి రమ్మన్న వేణుమాధవ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**చట్టం, నసురుల్లాబాద్:** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దుష్ట బొమ్మ దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పిరికిపందలైన ఉగ్రవాదులు ఉగ్రరూపం దాల్చి అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఈ దుశ్చర్యను దీనికి సహకరించే దుష్టశక్తులను అంతమందించడానికి దేశమంతా ఏకమై హిందువులంతా ఏకమై ఏక తాటిగా నడవాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో, హిందూ సంఘాల నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామిక వేత్త అభివృద్ధికి ప్రత్యేక వీ హబ్ ఏర్పాటు



**చట్టం, మెదక్:** కలెక్టరేట్ కార్యాలయంలో వీ హబ్ ద్వారా జిల్లాలోని SHG మహిళలు మరియు మహిళా పరిశ్రామికవేత్తలకు ర్యాంప్ (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ MSME పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా డిఆర్డిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరల్డ్ బ్యాంక్ మరియు కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ MSME నిధులతో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు/ MSMEs లకు బిజినెస్ యక్సలరేషన్ సపోర్ట్ అందనుంది అని వీ హబ్ డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్ మరియు అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాం లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మహిళా పరిశ్రామికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది. దీనిలో భాగంగా టెక్స్టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, మరియు హస్తకళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ & డైవర్సిఫికేషన్, బ్రాండింగ్ & మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్పర్ట్ మెంటరింగ్ మద్దతు ఉంటుందన్నారు. స్టూడెంట్స్ ప్రోగ్రాం ఓరియెంటేషన్ కార్యక్రమంలో యువ విద్యార్థులకు కోసం స్కిల్ డెవలప్మెంట్ మరియు కెరియర్ రెడీనేస్ కోసం వీ హబ్ నిర్వహిస్తున్న "ఐ లీప్" & "క్యాంపస్ ప్రేన్యూర్" ప్రోగ్రామ్స్ పైన వివరించారు అలాగే ప్రోగ్రాం యొక్క పోస్టర్ లాంచ్ చేశారు. కాగా కలెక్టరేట్ లో నిర్వహించిన ఈ ప్రోగ్రాం పైన అవగాహన కల్పించి వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**చట్టం, మెదక్ :** జిల్లాలోని టేక్మాల్ మండలం ఎల కుర్తి, చల్లపల్లి గ్రామాలలో F.P.O ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించి, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, కొనుగోళ్ల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తైన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని సూచించారు. ఈ పరిశీలనలో టేక్మాల్ తాసిల్దార్ తులసీరామ్, ఆర్ఐ సాయి శ్రీకాంత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడులను ఉపేక్షించేది లేదు: పన్నం నరేందర్ నేత



**చట్టం, ఎల్బీనగర్:** జమ్మూలోని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు పన్నం నరేందర్ నేత ఖండించారు.ఉగ్రవాదులు అమాయకమైన టూరిస్టులపై కాల్పులు జరపడం పిరికిపంద చర్య అని అన్నారు. టూరిస్ట్ లపై దాడులు చేసిన ఉగ్రవాదులను ఉపేక్షించవద్దని భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. టెర్రరిస్టులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి అమాయకమైన 28 మంది టూరిస్టుల ప్రాణాలను తీశారన్నారు. ఈ ఘటన దేశ పౌరులనే కాదు ప్రపంచ దేశాలను కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. జమ్ములో శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఇలాంటి ఉగ్రవాద దాడులు పునరావృత్తం కాకుండా భద్రత పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## భారత సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన మధుయాష్కి గౌడ్



**చట్టం, హైదరాబాద్:** నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ లో ఈ నెల 25, 26 తేదీలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'భారత సమ్మిట్ ' కార్యక్రమ ఏర్పాట్లను ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రివర్యులు ఉత్తం కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ గురుదీప్ సింగ్ సప్పల్ లతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను, భారత్ సమ్మిట్ థీమ్ కు సంబంధించిన పోస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ తదితర ప్రముఖులు కూడా హాజరయ్యారు.

# భూ భారతితో పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం

- **భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూ భారతి (నూతన ఆర్.ఓ.ఆర్) 2025 చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి ద్వారా పరిష్కారం కాని సమస్యలకు కొత్త భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములపై పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించిందని వివరించారు. భూముల హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణ కోసం కొత్త చట్టం అమలులో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని, ఆ దరఖాస్తులను ఆర్డీఓ, కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అభ్యంతరాలుంటే కలెక్టర్ దగ్గర అప్పీల్, ఆపై ల్యాండ్ ట్రిబ్యునల్ వద్ద అవకాశాలు ఉన్నాయని వివరించారు. పురాతన అప్పీల్ వ్యవస్థలతో పోలిస్తే, ఈ కొత్త రెవెన్యూ కోర్టుల ద్వారా రైతులకు వేగవంతమైన న్యాయం లభిస్తుందని చెప్పారు. భూసమస్యలు, భూ వివాదాలపై రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి వార్షికంగా వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తారని, ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గ్రామాల్లో గ్రామ పాలన అధికారుల నియామకంతో రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. రైతులు అడిగిన వివిధ భూ సమస్యలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. అనంతరం లోకేశ్వరంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున రైతులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా టెంట్ తప్పకుండా ఉండాలన్నారు. నిరంతరం రైతులకు త్రాగు నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. వరి కొనుగోలుకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సరిపడినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. నిర్ణీత సమయానికి వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసిల్దార్ మోతీరామ్, ఎంపిడిఓ రమేష్, నిర్మల్, భైంసా ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, ఆనంద్ రావు పటేల్, పిఎసిఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ 2024 తుది ఫలితాల్లో ప్రతిభ చాటిన తెలుగు రాష్ట్రాల ముద్దుబిడ్డలు



ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత స్థాయి క్యాడర్ పోస్టులలో తమ సత్తా చాటి యావత్ రెండు తెలుగు రాష్ట్రాలకే గర్వకారణం గా నిలిచిన తెలుగు విద్యాకుసుమాలు. గా చరిత్ర కెక్కారు తాజాగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్ సీ ) ప్రకటించిన సివిల్స్ 2024 ఫలితాల్లో 100 ర్యాంకుల లోపు ఏడుగురు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ర్యాంకుల వర్షం కురిపించి యావత్ తెలుగు రాష్ట్రాల ప్రజానీకానికే గర్వ కారణంగా నిలిచిన తీరు ఎంతైనా హర్షణీయం, స్ఫూర్తిదాయకం. ఒక విధంగా దేశంలోని అత్యున్నత స్థాయి క్యాడర్ పోస్టులు అయిన ఐఏఎస్, ఐపీఎస్ తదితర అలిండియా సర్వీసు పోస్టులను మన తెలుగు రాష్ట్రాల సరస్వతి మాత ముద్దుబిడ్డలు, అణిముత్యాలు చేజిక్కించుకోవడం వారి యొక్క ప్రతిభా, సామర్థ్యాలకునిదర్శనం గా చెప్పవచ్చు. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా మొత్తం 933 మందిని అయా క్యాడర్ పోస్టులకు ఎంపిక చేస్తే అందులో సుమారు ముప్పయి మంది మన తెలుగు రాష్ట్రాల వారు వున్నారు తమ మేధోసంపతి తో, జ్ఞాన సమపార్జనతో మంచి ర్యాంకులను కొల్లగొట్టడం అనేది ఒక అనితర సాధ్యమైన,అనిర్వచనీయమైన, చిరస్మరణీయ ఘట్టం అనడం లో ఎలాంటి సందేహం లేదు. అదేవిధంగా ర్యాంకులను తెచ్చుకున్న వారంతా సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు మరియు కొంతమంది రైతు కుటుంబాల నుంచి వచ్చినవారు కావడం ఒక గొప్ప చెప్పుకోదగ్గ విశేషం.ఏదిఏమైనా ' కృషి తో నాస్తి దుర్భిక్షం ' కృషి వుంటే మనుషులు ఋషులు అవుతారు. అనే మన పెద్దల నానుడిని నిజం చేస్తూ తాము నమ్ముకున్న విద్యా రంగం లో పెను సంచలనాలకు కేంద్రబిందువుగా నిలిచి సమున్నత శిఖరాలను అధిరోహించిన ఈ చదువుల తల్లి ముద్దుబిడ్డలకు కోట్లాది మంది తెలుగు రాష్ట్రాల ప్రజానీకం అయిన మనమందరం మనస్ఫూర్తిగా,హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేద్దాం,వారికి జేజేలు పలుకుదాం. ఏమైనా ముందుందు భవిష్యత్ లో సైతం మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇలా విద్యారంగం లో తమ అసాధారణ సత్తా చాటి, మన తెలుగు రాష్ట్రాలకు ఎనలేని కీర్తి, ప్రతిష్టలు తీసుకురావాలని మనసా,వాచ, కర్మణా మనమంతా కోరుకుందాం! జయ జయహో మన తెలుగు రాష్ట్రాల విద్యాకుసుమాలు, వారి అసాధారణ ప్రతిభకు శత కోటి వందనాలు తెలియజేద్దాం. వారిని స్ఫూర్తి గా తీసుకుని తెలుగు రాష్ట్రముల విద్యార్థులు మరింతగా కష్టపడి అధిక సంఖ్యలో ర్యాంకులు సాధిస్తారని ఆశించుధాం.ముఖ్యం గా వరంగల్ ఖిలా వరంగల్ కి చెందిన సాయి శివాని 11 ర్యాంక్శ్రీకాకుళంకి చెందిన బన్న వెంకటేష్ 15 ర్యాంక్ హన్మకొండ కి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త రావుల ఉమా రెడ్డి కుమారుడు జయ సింహ రెడ్డి 46 వ ర్యాంక్ సాయి తేజ 154 చేతన్ రెడ్డి 110 శివ గణేష్ రెడ్డి 119 పవన్ కళ్యాణ్ 146 శ్రీకాంత్ రెడ్డి 151 హరి ప్రసాద్ సాయి కిరణ్ మరియు ఎంతో మంది మంచి ర్యాంక్స్ సాధించి సివిల్స్ కి ఎంపిక అయ్యారు వారికి అభినందనలు

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా 9848445134**

## కిడ్స్ పార్క్ పాఠశాలలో ఘనంగా అన్యువల్ డే సెలబ్రేషన్




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో గల కిడ్స్ పార్క్ స్కూల్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్యువల్ డే ను, గ్రడియేషన్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న, సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు భాకారం. రవి, మండల మైనార్టీ సేల్ అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు భాకారం రవి మాట్లాడుతూ.. కిడ్స్ పార్క్ స్కూల్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి వెళ్తున్నందుకు పాఠశాల మేనేజ్మెంట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. కేవలం ఐదు సంవత్సరాలలో పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలగా సిరికొండ మండలంలో పేరుగాంచిందని అన్నారు. మునుముందు పిల్లలందరికీ మంచి విద్యను అందించి మండలంలో మంచి పేరును తీసుకురావాలని పాఠశాల మేనేజ్మెంట్కు కోరారు. పాఠశాలలో అన్ని వసతులతో మంచి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని కేవలం చదువులోనే కాకుండా పిల్లలకి అనేక కార్యక్రమాలలో ముందు ఉంచుతున్నారని దానికి నిదర్శనంగా మొన్న జరిగినటువంటి మండల స్థాయి ఆటల పోటీలలో మార్చి ఫస్ట్ లో రెండవ స్థానంలో నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు లియక్షత్ మాట్లాడుతూ కిడ్స్ పార్క్ పాఠశాలలో ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్నారని వారందరూ పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని దీనికి మేనేజ్మెంట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దీనికి సహకరించిన పాఠశాల తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి , ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మునుముందు రాబోయే రోజుల్లో పాఠశాలలో చదివే పిల్లలకు మంచి నాణ్యమైన విద్యను అందిస్తామని, ఇంగ్లీష్ కు ప్రాధాన్యతను ఇస్తామని, పిల్లలకు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందు ఉంచుతామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయానికి ఎల్లవేళల శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ సయ్యద్ ఆసిఫ్, మండల కాంగ్రెస్ నాయకులు సంతోష్ నాయక్, నర్సారెడ్డి, రామ్ ,భూమన్న, పాఠశాల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పహల్గావ్ ఉగ్ర దాడిని ఖండించిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ



**చట్టం ధర్పల్లి:** ఇటీవల పహల్గావ్ లో అమాయకులైన 25 మంది భారత పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటనకు నిరసనగా, గురువారం ధర్పల్లి మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూ క్రసి ఆధ్వర్యంలో యువకులు కొవ్వతుల ర్యాలీ నిర్వహించారు. సభ్యులు బాలయ్య మాట్లాడుతూ, ఉగ్రవాదులు అమాయకులైన వారిని బలి కొనడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. భారత సర్కార్ అటువంటి వారికి దీటైన జవాబు త్వరలోనే ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీ గురు పీఠం దేవాలయాలలో ప్రతిష్ఠించే విగ్రహాల ఊరేగింపు



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని శ్రీ గురు పీఠంలో నిర్మిస్తున్న షిరిడి సాయిబాబా దత్తాత్రేయ దేవాలయాలలో ప్రతిష్ఠించే సాయిబాబా దత్తాత్రేయ విగ్రహాలను గురువారం శివ్వంపేట మండల కేంద్రంలోని రామాలయం నుండి గూడూరు గ్రామంలోని శ్రీ గురు పీఠం వరకు ప్రముఖ పురోహితులు శాస్త్రుల వామన శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువెళ్లడం జరిగింది. శ్రీ గురు పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ దేవాలయాలు నిర్మించిన విషయం అందరికీ తెలిసిందే . సాయిబాబా దత్తాత్రేయ స్వామి ఊరేగింపు శోభయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖులు ప్రజలు భక్తులు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్, సాదరంగా ఆహ్వానించారు. ఈ ఊరేగింపు దైవ సాంప్రదాయ పద్ధతిలో మంత్రోత్సవం మధ్య తీసుకువెళ్లడం జరిగింది. ఈ ఊరేగింపు కార్యక్రమం లో రాష్ట్ర హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్, మాజీ సర్పంచులు పులిమామిడి స్రవంతి నవీన్ గుప్తా , పత్రాల శ్రీనివాస్ గౌడ్, స్వరాజ్ లక్ష్మి శ్రీనివాస్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొడ్డు రవి ,గౌరవాధ్యక్షులు ఇసుగారి మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ లు రాజీపేట పద్మా వెంకటేష్, ప్రముఖ వ్యాపారవేత్తలు నోముల హనుమంతు గుప్తా, రాజ్యం బిక్షపతి యాదవ్, నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, వారాల గణేష్, ఇసారపు రాజు గౌడ్, దానబోయిన కృష్ణ, వంజరి గౌరీ శంకర్, బిజిలిపురం సత్తయ్య, బాసంపల్లి ప్రభు లింగం గౌడ్, కమలయ్య గారి వెంకటేష్, కొత్తపేట వెంకటేష్ గౌడ్, భీమనపల్లి మురళి, బల్కంపేట భాస్కర్ కొంతనపల్లి సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## వడ్ల ను కాంటా చెయ్యరు కష్టాలు తీర్చరు...



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట గ్రామంలో 20 రోజులుగా వడ్ల కల్లాల వద్ద రైతులు పోయగా ఇంతవరకు కాంటా చేయడానికి ఎవరు రావట్లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు .గురువారం సదాశివ నగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు కు రైతులు ఫోన్ చేయగా రైతుల కష్టాలు తెలుసుకోవడానికి స్వయంగా మాజీ జెడ్పిటిసి వడ్ల కల్లాల వద్దకు వెళ్లారు 20 రోజులుగా ఎందుకు సింగిల్ విండో సిబ్బంది రావడం లేదని రైతుల ఆయన దృష్టికి తీసుకెళ్లారు వెంటనే ఆయన సింగిల్ విండో సీఈవో ఫోన్ చేసి వడ్లను తరలించడం లేదని ప్రశ్నించారు . హమాలీలు దొరకడం లేదని రెండు రోజుల్లో వడ్లను తరలించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వరి దిగుబడి తక్కువ వచ్చింది అంటే వచ్చిన వడ్లను కూడా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడం లేదని రైతులు వివరించారు గతంలో ఇటువంటి కష్టాలు తాము చూడలేదని వారు అన్నారు. వెంటనే అధికారులు వడ్లను తరలించడానికి తగిన ఏర్పాటు చేయాలని ఎండలు మండుతున్న తరుణంలో రైతులు వడ్ల కోసం వెళ్లి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది .ఈ కార్యక్రమంలో ధర్మరావుపేట సురేష్ ఆ గ్రామ మాజీ రైతుబంధు అధ్యక్షుడు హనుమాన్లు గ్రామ టిఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రైతులు పొన్న గోవర్ధన్ గౌండ స్వామి పల్వంచ చిన్న సాయిలు దార పెద్ద గంగారం లావణ్య అనుషవ్వ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

## మా ఊరి కథలలో అచ్చ సుదర్శన్ జీవిత కథ






**చట్టం / నడికుడ:** హనుమకొండ జిల్లా నడికుడ మండలం లోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అచ్చ సుదర్శన్ జీవిత చరిత్ర భవాని సాహితీ వేదిక కరీంనగర్ వారి ఆధ్వర్యంలో గుండ మీది కృష్ణమోహన్ అనే కవి మా ఊరి కథలు(స్ఫూర్తి మంతుల చరిత్రలు) అను పుస్తకాన్ని రాయడం జరిగింది. ఈ పుస్తకాన్ని ఈరోజు ఓపెనింగ్ చేయడం జరిగింది.అట్టి పుస్తకంలో అచ్చ సుదర్శన్ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని కవి రాయడం జరిగింది. తాను బీదరికం నుంచి నుంచి ఎదిగి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా చేరుకున్న కథను ఇతర ఉపాధ్యాయులకు,యువకులకు స్ఫూర్తిగా ఉందని, చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడని కవి గుండ మీది కృష్ణమోహన్ అన్నారు. అందుకే స్ఫూర్తి మంతుల చరిత్ర లో అచ్చ సుదర్శన్ కు స్థానం దక్కిందని అన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సోదా రామకృష్ణ

**చట్టం /పరకాల :** పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రామిని శ్రీశైలం బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా గురువారం పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోద రామకృష్ణ పరామర్శించారు. ఆయనవెంట 20వ వార్డు కాంగ్రెస్ నాయకులు బొచ్చు శ్రీనివాస్, బొచ్చు సాల్మన్, రేండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# భూమి అంటే ఆదాయాన్ని ఇచ్చే వనరే కాదు..ఆత్మ గౌరవం



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** భూమి అంటే ఆదాయాన్ని ఇచ్చే వనరే కాదు సమాజంలో ఆత్మ గౌరవం అని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.ఆయన గురువారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో భూభారతి నూత ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమంనకు హాజరయ్యారు.ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ... రైతుల శ్రేయస్సు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భూ భారతి చట్టంతో రైతులతో పాటుగా భూములను కొనుగోలు చేసే వారందరికీ మేలు జరుగుతుందన్నారు. కొత్త చట్టం ద్వారా వారసత్వ, ప్రభుత్వ , అటవీ , సాగునీటి శాఖ, అసైన్డ్ భూమి, దేవాదాయశాఖ భూముల అనేది స్పష్టంగా తెలుస్తుందని స్పీకర్ తెలిపారు. గా తెలుస్తుంది. భూములు కొనుగోలు చేసే వారు మోసపోకుండా జాగ్రత్తగా ఉంటారని అన్నారు. రైతులకు మేలు చేసే విదంగా క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలను తీసుకుని పకడ్బందీగా భూ భారతి చట్టాన్ని రూపొందించాలని స్పీకర్ సూచించారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ప్రయోజనాలు ముఖ్యంమని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి మంచి ప్రయత్నం లేదు. వ్యాపారస్తులు, దళారులకు కొమ్ము కాసే విదంగా నలుగురు పెద్దలు ఏసీ రూమ్ లో కూర్చొని ధరణి అనే భూతాన్ని రూపొందించాలని ఆయన అన్నారు. వేలాది ఎకరాల దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల భూములను లాక్కున్నారని, ధరణి తో సమస్యలు పెరిగాయని, ఎక్కడ చూసినా చిక్కుముడులతో కూడుకుందని ఆయన అన్నారు. ధరణి కారణంగా ఎంతోమంది రైతులు, కొనుగోలు చేసిన మధ్య తరగతి ప్రజలు ఆత్మహత్యలు చేసుకొని దుస్థితికి తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. ధరణి లో ఉన్న లోపాలను గుర్తించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తానని హామీ ఇచ్చి, అన్న మాటకు కట్టుబడి మాటను నిలబెట్టుకుని ఇప్పుడు రైతుల మేలు కోసం భూ భారతిని తెచ్చారని తెలిపారు. రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు రైతు బిడ్డకు మాత్రమే తెలుస్తుందని ఆయన అన్నారు. భూ భారతి అమలుతో రైతులతో పాటుగా భూమి ఉన్న వారందరికీ మేలు జరుగుతుందని, భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పీకర్ తెలిపారు. భూమికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుందని భూముల అమ్మకాలు, కొనుగోలు సులభంగా జరుగుతాయని తెలిపారు. అమాయకులైన రైతులు మోసపోకుండా భూ భారతి అండగా ఉంటుందని, భూ భారతితో మీ భూములకు వంద శాతం భద్రత ఉంటుందని ఆయన అన్నారు. సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయని, మీ భూముల సమస్యల పరిష్కారానికి ఎవ్వరి దగ్గర పైరవీలకు పోవాల్సిన అవసరం లేదని ఆయన రైతులకు సూచించారు. భూ భారతి పోర్టల్ లో అన్ని రకాల ఆప్షన్లు ఉన్నాయని, సామాన్యులకు కూడా అర్ధమయ్యే విదంగా సరళంగా డిజైన్ చేయడం జరిగిందని, రెవెన్యూ అధికారులు మీకు అందుబాటులో ఉంటూ సహాయం చేస్తారన్నారు . రెవెన్యూ ఆధికారులను కోరేది ఒక్కటే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి అసలైన పట్టా దారులకే పట్టా పాస్ పుస్తకాలను ఇవ్వాలని సూచించారు. అన్నదాతల మేలు కోసం తెచ్చిన భూ భారతి చట్టాన్ని అధికారులు సక్రమంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం రైతుల ప్రభుత్వం. ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలో రైతుల కోసం రూ.54 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని, దేశ చరిత్రలో మొదటి సారిగా 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని స్పీకర్ తెలిపారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 రూపాయల బోనస్ ఇస్తున్నారని ఆయన అన్నారు. సన్న బియ్యం పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వం మీద అదనంగా రూ.2 వేల 858 కోట్లు భారం పడినా పేదలు కడుపునిండా అన్నం తింటారనే మానవత్వంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ మాట్లాడుతూ... ప్రజలు ఎలాంటి భూ సమస్యలున్నప్పటికీ కోర్టులను ఆశ్రయించకుండా సమస్యలు పరిష్కరించే వెసులుబాటును భూభారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. భూ సమస్యల సత్వర పరిష్కారానికి ఈ చట్టం ఎంతగానో దోదపడుతుందని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్, సాదా బైనమా, సీలింగ్, అసైన్మెంట్ , వారసత్వ భూముల పరిష్కారంతోపాటు మార్పులు చేసుకునే అవకాశం భూ భారతి లో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డిసిఎంఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసిల్దార్ లక్ష్మీ నారాయణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఆదేశాల మేరకు ఈనెల 26 వ తేదీన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లడి లో నిజామాబాద్ జిల్లా సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్ ని నిర్వహించడం జరుగుతుందని నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ లు తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28,29&30 తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించబోయే తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 26వ తేదీ శనివారం ఉదయము 8:00 గంటలకు జెడ్పీహెచ్ఎస్ కల్లడి స్కూల్ నందు నిజామాబాద్ జిల్లా హ్యాండ్బల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్ కు రిపోర్ట్ చేయవలసిందిగా కోరారు. సంప్రదించవలసిన నంబర్లు 9642535535, 9440441757.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో గల కుమ్మరి గంగాధర్ (42) అనే వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు పెట్రోల్ పంపులో పని చేసి జీవనం సాగించేవాడు మృతి చెందిన వ్యక్తికి ఇద్దరు పిల్లలు ఉన్నారని కుటుంబ సభ్యుల తెలియజేశారు. మిగతా విషయాలు తెలియాల్సి ఉంది.

## కవిత్వం సామాజిక బాధ్యత




**చట్టం (ప్రతినిధి కామారెడ్డి):** కవిత్వం సామాజిక బాధ్యత అని కవులు ఎంతో బాధ్యతతో రచనలు చేయాలని జనం బాధలకు తమ అక్షరాల్లో పరిష్కారం మార్గం చూపాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు . గురువారం కామారెడ్డి లోని సీనియర్ సిటిజన్స్ ఫోరం లో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు . నేడు సమాజంలో అసమానతలు రుగ్మతలు పెరిగిపోతున్నాయని వీటికి కళాలు అక్షరాల ద్వారా తమ రచనల ద్వారా పరిష్కారం చూపాలని సమాజంలోని చెడును తొలగించే విధంగా రచనలు ఉండాలని తెలంగాణ నేలపై ఎక్కడ తవ్విన కవిత్వపు ఊటలు ఉంటాయని ఏ నేలపై అయితే కవులు సమృద్ధిగా ఉంటారు. ఆ నేలపై బతుకు కావ్యాలు అల్లబడతాయని కవిత్వం అంటే కథన రంగాన్ని కదిలే తెలంగాణ కవులు రచయితలు రచనల ద్వారా వెలుగు బాటలు చూపాలని కవులు అక్షరసాయుదు ఇలా ఉండి సూక్ష్మ దూర దృష్టితో రచనలు చేయాలని కవులు కవిత్వంతో నిత్య సాధన చేసి సమాజానికి మేటి రచనలను అందించాలని అడుగడుగునా జరుగుతున్న అన్యాయాలను దోపిడీలను తమ రచనల్లో విప్పి చెప్పాలన్నారు . తమ రచనల ద్వారా సమాజంలోని సమస్యలను పరిష్కరించే విధంగా కవులు రచయితలు ఎల్లప్పుడూ ముందు ఉండాలని అన్నారు . సాహిత్యం ఒక సృజన ప్రక్రియని ఈ సృజన ప్రక్రియ ద్వారా సమాజాన్ని మరింత చైతన్యవంతం చేయవచ్చు అని అన్నారు . ఈ కార్యక్రమంలో కవులు తమ కవిత గానాలను వినిపించారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎనిశెట్టి గంగా ప్రసాద్ ,కాసర్ల రామచంద్రం ,వైద్య శేషరావు, నాగభూషణం, కాశ నరసయ్య తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

## లారీని ఢీకొన్న మరొక లారీ..

**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరొక లారీ ఢీకొన్న ఘటన జాతీయ రహదారిపై జరిగింది. కామారెడ్డి మండలం శాబ్దిపూర్ శివారులో బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి నాగ్పూర్ వైపు వెళ్తున్న లారీ శాబ్దిపూర్ శివారులో మేఘన హోటల్ వద్ద పార్కింగ్ చేసి ఉంది. వెనక నుంచి వచ్చిన మరో లారీ పార్కింగ్ చేసి ఉన్న లారీని ఢీకొంది ఈ ప్రమాదంలో ఢీకొన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. దీంతో డ్రైవర్ రాములు క్యాబిన్ లో ఇరుక్కుపోయాడు. హైవే పెట్రోలింగ్ ఎస్సై నర్సింలు, సిబ్బంది సదయ్య, హుసేన్ ఘటనాస్థలానికి చేరుకుని క్యాబిన్లో ఇరుక్కున్న రాములును సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించారు



## ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాపై నిలదీత



**చట్టం, చెన్నూర్ రూరల్:** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సుద్దాలలో గురువారం చోటుచేసుకున్నది. సుద్దాలలో పంచాయతీ కార్యదర్శి కళ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఎంపికచేసిన జాబితా వివరాలను వెల్లడించారు. 615 మంది దరఖాస్తు చేసుకోగా 412 మందిని ఎంపిక చేసి ఆన్లైన్ చేశారు. ఇందులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు 42 మంది లబ్ధిదారులను ఎంపికచేసినట్టు సెక్రటరీ తెలుపగా, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులను పక్కనపెట్టి ఇండ్లు ఉన్న వారిని ఎలా ఎంపిక చేస్తారని మండిపడ్డారు. సుద్దాలలో దాదాపు 300 నిరుపేద కుటుంబాలుంటాయని, కేవలం 42 మందిని ఎలా ఎంపిక చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై ఎంపీవో అజ్మత్ అలీని వివరణ కోరగా... ఇందిరమ్మ కమిటీ సభ్యుల సూచన మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఎంపికలు జరిగాయని తెలిపారు.

## దశ, దిశ చూపేలా రజతోత్సవ సభ



**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రానికి దశ, దిశ చూపేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేత, మా జీ ఎంపీ వినోద్కుమార్ తెలిపారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో మాజీ ఎమ్మెల్యే పీ శశిధర్రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్గౌడ్, నాయకులు పట్నం మాణిక్యం, సీ కల్యాణ్రావుతో కలిసి గురువా రం విలేకరులతో మాట్లాడారు. హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో కనీవిని ఎరుగని రీతిలో సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నామని, సభకు తరలివచ్చే వారికి ఇలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చె ప్పారు. ఇప్పటికే 3వేల బస్సులను బుక్ చేశామని, వీటికి అదనంగా ప్రైవేట్ వాహనాలను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఇంటిపార్టీ పండుగకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన పార్టీ, 25వ వసంతంలోకి అడుగుపెట్టడం గొప్ప విషయమని చెప్పారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని పార్టీ అధికారంలోకి వచ్చాక అధినేత కేసీఆర్ చేసి చూపించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అడగడుగునా విఫలమైందని విమర్శించారు. రజతోత్సవ సభా వేదికగా కేసీఆర్ సందేశం కోసం యావత్ తెలంగాణ ప్రజానీకం ఉ త్కంఠ, ఉత్సుకతతో ఎదురుచూస్తున్నదన్నారు.

**దేశ భద్రత విషయంలో సంపూర్ణ మద్దతు**

పహల్గామ్ ఘటనతో ఉగ్రవాద వికృతరూపం మరోసారి బట్టబయలైందని, ముష్కరుల మారణహోమం దారుణమని ఖండించారు. యావత్ సమాజం ఇలాంటి దేశ విద్రోహ చర్యలను ముక్తకంఠంతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతకు కేంద్రం తీసుకునే ప్రతిచర్యకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

## ముగ్గురు రైతుల ఆత్మహత్య.. దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక



**చట్టం, కారేపల్లి /రాజాపేట /నర్సాపూర్:** దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందిన ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఖమ్మం, యాదాద్రి, మెదక్ జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన లావుడ్యా భద్రు (52) రెండెకరాల్లో మిర్చి, మరో రెండెకరాల్లో పత్తి పంట వేశాడు. సాగు చేసిన పంటను చీడపీడలు ఆశించడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడింది. దీంతో పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చేందుకు వ్యవసాయం చేయడంతోపాటు ఓ షాపులో గుమస్తాగా చేరాడు. అయినా అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన భద్రు తన మిర్చి తోట వద్దకు వెళ్లి బుధవారం ఉదయం గడ్డి మందు తాగాడు. తర్వాత భార్యకు ఫోన్చేసి.. 'నేను గడ్డి మందు తాగాను. పిల్లలు జాగ్రత్త' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే చేను వద్దకు చేరుకుని భద్రును ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకొచ్చి అనంతరం వాహనంలో ఖమ్మం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ భద్రు గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై నాగరాజకుమారి తెలిపారు.

**బోర్ల కోసం 4 లక్షలు అప్ప చేసి..**

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడ్డి చెరువు గ్రామానికి చెందిన రైతు కర్రె మహేశ్(28) వ్యవసాయంతో పాటు ఆటో నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు, సాగునీటి కోసం వేసిన బోర్లకు రూ. 4 లక్షలు అప్పు చేశాడు. పంట దిగుబడి లేక, ఆటో నడువక చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

**మూడు బోర్లేసినా దక్కని ఫలితం..**

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన నేనావత్ జహంగీర్ (35) తనకున్న ఎకరా పొలంలో సరిగ్గా నీరు లేకపోవడంతో అప్పు చేసి మూడు బోర్లు వేయించాడు. దీంతోపాటు వేసిన పంట సరిగ్గా పండక తీవ్ర నష్టం వాటిల్లింది. బోర్లకు, పంట పెట్టుబడికి సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోవడంతో జహంగీర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 12న తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య నేనావత్ సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లింగం తెలిపారు.

## ఎల్లారెడ్డిలో ముస్లిం మైనారిటీలు కొవ్వొత్తుల ర్యాలీ



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గ్ మ్ లో పౌరుల పై జరిగిన ఉగ్రదాడిలో అమరులైనా వారికి గురువారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలో గాంధీచౌక్ లో ముస్లిం మైనారిటీలు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులు అర్పించారు. ముస్లిం మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ గయజోఉద్దీన్ మాట్లాడుతూ పౌరులపై జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు

## ఎక్సైజ్ కానిస్టేబుల్ కు అభినందన..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ బి హనుమంతరావు కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దేవా కుమార్ ను అభినందించారు. దేవా కుమార్ సోమవారం రాత్రి రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య చేసుకోబుతున్న ఒక మహిళ ను గమనించి 100 కి డయల్ చేయడమే కాకుండా వాళ్ళు వచ్చేవరకు సమయస్ఫూర్తి తో వ్యహరించాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణ తో పాటు సమాజానికి తోడ్పడే పనులు చేయాలని, ఒక మహిళ ప్రాణాలు కాపాడి ఆ కుటుంబాన్ని కూడా కాపాడవని తెలిపి దేవకుమార్ ని శాలువా తో సత్కరించారు..ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎక్సైజ్ సిఐ విజయ్ కుమార్ ఎస్ఐలు విక్రమ్ కుమార్, శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిలో మృతులకు నివాళి



**చట్టం నేరడిగొండ :** మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కాశ్మీర్ పహల్గవ్ లో జరిగిన ఉగ్రవాద దాడిలో చనిపోయిన హిందూ బంధువులకు నివాళులు అర్పిస్తూ జరిగిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర అధ్యాపకులు సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్. బలరాం మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు తర్వాత అభివృద్ధి చెందుతున్న కాశ్మీర్ ని చూసి ఓర్వలేకనే పక్క దేశాల ఉగ్రవాద ముఖలు ఈ దాడికి పాల్పడ్డాయి. మన ప్రధాని దీనికి ప్రతీకారం తీసుకోవాలని అన్నారు. ఈ ర్యాలీలో యువత మరియు ఉద్యోగులు పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

## ఇంటరాక్టివ్ డిస్ప్లే బోర్డ్ ఆవిష్కరణ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని నారాయణ పాఠశాలలో గురువారం రోజు ఇంటరాక్టివ్ డిస్ప్లే బోర్డును ఘనంగా ప్రారంభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, డీజీఎం రమణారెడ్డి, ఏజీఎం శివాజీ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీఎం శివాజీ, స్మార్ట్ బోర్డ్ ను ఆవిష్కరించారు. మాట్లాడుతూ నారాయణ విద్య సంస్థల ఆధ్వర్యంలో స్మార్ట్ బోర్డ్ ప్రవేశ పెడుతూ విద్యార్థుల మెరుగైన ప్రతిభను కనబడడానికి దోహదపడుతుందని, మా విద్యా సంస్థలు అన్ని రంగాల్లో ముందు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో డీన్ సందీప్, ఏవో నవీన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పహాల్గమ్ ఉగ్రదాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**చట్టం, భైంసా :** బైంసా పట్టణంలోని కమల జీనింగ్ ఫ్యాక్టరీలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జమ్మూ కాశ్మీర్లో జరిగిన సంఘటనను పహల్గాంలో పర్యటకులపై దాడికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో పహల్గాంలో ఉగ్రవాద దాడిలో అసువులు బాసైన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, పోయిన ప్రాణాలు తిరిగి రావు కావున వాళ్ల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మరియు ఏ రాష్ట్ర పర్యాటకులు అసువులు బాసినారో ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వాళ్ళ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తామని ప్రకటించారు, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే, ముత్యం రెడ్డి, రామచంద్ర రెడ్డి, ప్రెమ్నత్ రెడ్డి, అట్టల్, దేవిదాస్, శ్రీనివాస్, గంగారెడ్డి, sk నాజిం తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ పహిల్గవ్ ఉగ్రదాడిలో మరణించిన టూరిస్టులకు

**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాశ్మీర్ లో పహిల్గవ్ లో జరిపిన ఉగ్రదాడికి నిరసనగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ అధ్యక్షతన కోరుట్ల పట్టణ కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో ప్రజలపై ఉగ్రవాదులు జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని మతోన్మాదులు హిందూ వాదులుగా గుర్తించుకున్న తర్వాత పర్యాటకులను కాల్చడం హేమమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ప్రపంచదేశాలు భారతదేశంలో సంఘీభావం ప్రకటించడం పట్ల భారతదేశంలో శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారని నిదర్శనమన్నారు భారత జాతి ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, పేస్ చెర్మన్ ఎలిశెట్టి భూమారెడ్డి, సొగ్రాభి, మచ్చ కవిత, మ్యాకల నర్సయ్య, ఎంబేరి సత్యనారాయణ, చిటిమెల్లి రంజిత్ గుప్తా, దండవేణి వెంకట్ , నజ్జు, కోరుట్ల వెంకటేశ్వర దేవాలయ చెర్మన్ ఏతిరజం నర్సయ్య, నాయకులు కట్కమ్ దివాకర్, కోట గంగాధర్, గోడికే రాములు, నేతి శ్రీనివాస్, ఎంబేరి నాగభూషణం, పుప్పాల ప్రభాకర్, సంగ లింగం, మోర్తాడ్ లక్ష్మినారాయణ, రిజ్వాన్, లొకిని వెంకట్ , ఏఆర్ అక్బర్, పోతుగంటి శంకర్ గౌడ్, రాజోజి భూమయ్య, పాసుల క్రిష్ణప్రసాద్, తెడ్డు విజయ్, పెండెం రమేష్, వాసం అజయ్, ముత్యాల గంగాధర్, గొల్లపెల్లి ఎల్లయ్య, యూట్యూబ్ రాజు తదితరులు ఉన్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన నసీమా సుల్తానా, నాగర్ కర్నూల్ కు బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో రంగారెడ్డి కోర్టులో డి.ఎల్.ఎస్.ఎ.కార్యదర్శి గా పనిచేసిన శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జిగా ఆర్మూర్ న్యాయస్థానంలో విచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జక్కుల శ్రీధర్, ఉపాధ్యక్షులు గటడి ఆనంద్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్, కార్యవర్గం ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ జూనియర్ సివిల్ జడ్జ్ వేముల దీప్తి, గౌరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సరళారాణి, గౌరవ సెకండ్ క్లాస్ జడ్జ్ గట్టు గంగాధర్, ఏజిపి చిన్నారెడ్డి, అడిషనల్ పీపీ ఖాందేశ్ శ్రీనివాస్, అసిస్టెంట్ పిపి రామకృష్ణ, బార్ కమిటీ సభ్యులైన సంయుక్త కార్యదర్శి మద్దుల గంగారం, కోశాధికారి చైతన్య, గ్రంథాలయ కార్యదర్శి శ్రావణ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు



**చట్టం ఆర్మూర్:** మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆర్మూర్ ట్రాఫిక్ ఎస్ఐ రఘుపతి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీలలో పట్టుబడ్డ మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఇకనుండి మైనర్లు పట్టుబడితే వాహన యజమానికి 3 సంవత్సరాల జైలు శిక్ష, 25 వేల జరిమానా, మైనర్ కు 25 ఏళ్ల వయసు వచ్చేదాకా లైసెన్స్ రాదని వాహనం ఆర్ సి ఏడాదిపాటు రద్దు అవుతుందన్నారు.

## ఓ ఆర్ ఎస్ పాకెట్ల పంపిణీ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో గురువారం రోజు మున్సిపల్ కమిషనర్ రాజు, పారిశుద్ధ్య కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోవు రోజులలో ఎండల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున పారిశుధ్య కార్మికులు అందరూ ఎండల నుండి రక్షణ కొరకు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పారిశుధ్య పనులు చేయాలని సూచించడంతో పాటు కార్మికులందరూ ప్రతిరోజు పనులకు హాజరుకావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభకు తరలిరావాలి



**చట్టం /పరకాల :** బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పరకాల మాజీ ఎంపీటీసీ చందుపట్ల సాయి తిరుపతి రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ ఎల్క తుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భారీగా జనాలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న ప్రతి ఒక్కరు గులాబీ జెండాతో సభకు కదలాలని కోరారు.

## పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన సిపిఎం




**చట్టం ఆర్మూర్:** పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పెద్ది వెంకట రాములు, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ లు మాట్లాడుతూ, క్షతగాత్రులు శీఘ్రంగా కోలుకుకోవాలని సిపిఎం ఆకాంక్షించిందన్నారు. అత్యంత హేయమైన, హింసాత్మకమైన ఈ దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించేలా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కాశ్మీర్‌లో అంతా బాగుంది. శాంతిభద్రతలను భేషుగ్గా పునరుద్ధరించాం అంటూ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేస్తున్న ప్రచారమంటూ పచ్చి బూటకమని ఈ ఉగ్రవాద దాడి తెలియజేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సమయాన్ని వృధా చేయకుండా జమ్ముకాశ్మీర్ ప్రజల సమస్యలకు రాజకీయ పరిష్కారం చూపాలని డిమాండ్ చేసారు. కాశ్మీర్ లోయలో పర్యాటకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని విదేశీయులకు కూడా రక్షణ లేకుండా ఉంది అనే సంకేతాలకు అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు కుతాడి ఎల్లయ్య, ఇడగొట్టి సాయిలు, కుల్దీప్ శర్మ, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట మండల కేంద్రంలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిపై ముక్తకంఠంతో మా నందిపేట్ ప్రజలు దీన్ని ఖండిస్తున్నాం, ఉగ్రవాదులను వెంటనే పట్టుకొని ఊరి తీయాలి. ఉగ్ర దాడి లో చనిపోయిన 27 మంది శాంతి, గాయపడిన వారికి తొందర్గా కోలుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిది చెక్కు అందజేత



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ రథసారథి ప్రోద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ఆదేశాల మేరకు నందిపేట్ మండలం లోని ఖుద్వాన్పూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుండు ముత్తెమ్మకి 19000 వెయ్యిల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, కాంగ్రెస్ నాయకులు బైండ్ల ప్రశాంత్, ఎడ్డిగారి నిఖిల్, తబ్రేజ్, గుండు హరీష్, తుక్కన్న, తోట మహేష్, తిమ్మల శివ, ముజీబ్, రెహమాన్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి

**కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా గురువారం బిర్కూర్, నసురుల్లాబాద్ రైతువేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025 న ప్రారంభించడం జరిగిందని, చట్టం పై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణీ స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసి క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుంది తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఇంతే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుంది అని తెలిపారు. భూమి హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసు పుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. బిర్కూర్ గ్రామస్తుడు రవి మాట్లాడుతూ, తమ గ్రామంలో సర్వే నెంబర్ 228 లోని సమస్యను పరిష్కరించాలని కోరారు. సాయిబాబా మాట్లాడుతూ, పట్టాలు ఉండి భూమి లేదని, భూ భారతి ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతులకు చట్టాల గురించి ఈ ప్రభుత్వం తెలియజేయడం హర్షణీయం అని కిషోర్ తెలిపారు. నసురుల్లబాద్ గ్రామ రైతు నగేష్ మాట్లాడుతూ ప్రజల వద్దకు అధికారులు రావడం ప్రజాపాలన ప్రభుత్వమని అన్నారు. రైతుల సమస్యలు భూ భారతి తో పరిష్కరించాలని తెలిపారు. గంగారం మాట్లాడుతూ ధరణీ వలన పరిష్కారం.కానీ సమస్యలు భూ భారతి చట్టం తో పరిష్కరించాలని కోరారు. నసురుల్లాబాద్ మండల ప్రత్యేక అధికారి దయానంద్ మాట్లాడుతూ, రైతుకు భూమి యొక్క రికార్డు లు బాగుంటే రైతు ధైర్యంగా ఉంటాడని తెలిపారు. ధరణీ వలన ఎన్నో కేసులు పరిష్కారం కాకుండా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సులోఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**చట్టం/హనుమకొండ:** ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలవిద్యార్థిని, విద్యార్థులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం అభినందనలు తెలియజేశారు. హసన్ పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వడ్డేపల్లి లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ధర్మసాగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించగా జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరును తీసుకువచ్చారని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు రానున్న రోజుల్లోనూ ఇదేవిధంగా రాష్ట్రస్థాయి ఫలితాల్లో జిల్లా పేరును ముందు నిలపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రూ.30 కోట్లు ఖర్చు.. లగ్జరీ ఏర్పాట్లు!




**చట్టం, హైదరాబాద్:** రెండు రోజులు.. 100 దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు.. స్టార్ హోటళ్లలో బస ఏర్పాట్లు... వెరసి రూ.30 కోట్లకుపైగా ఖర్చు. ఇవీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమ విశేషాలు. కాంగ్రెస్ ఎజెండాలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు శుక్రవారం ప్రారంభంకానున్నది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తూ నిర్వహిస్తున్న సదస్సు వల్ల తెలంగాణ ప్రజలకు, ఒనగూరె ప్రయోజనం ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఎజెండాను అమలుచేసేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత్ సమ్మిట్ ఎజెండాను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశంలో రాజ్యాంగం పరిరక్షణ, ప్రజాస్వామ్యం, సమన్యాయం తదితర అంశాలపై భారత్ సమ్మిట్‌లో చర్చిస్తామని మంత్రులు చెప్తున్నారు. అంతర్జాతీయ స్థాయి సదస్సు పెట్టి ఇలాంటి అంశాలపై చర్చించడం ఏంటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అప్పుడు తెలంగాణపై.. ఇప్పుడు దేశంపై..?**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి తెలంగాణ అప్పులపాలైందని, దివాలా తీసిందని ప్రచారం చేస్తున్నది. తద్వారా దేశ, అంతర్జాతీయ వేదకలపై తెలంగాణ ఖ్యాతిని దెబ్బతీసిందనే విమర్శలున్నాయి. అప్పుల పేరుతో నిన్న, మొన్నటివరకు తెలంగాణను బద్నాం చేసిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దేశాన్ని నవ్వులపాలు చేయాలనే కంకణం కట్టుకున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మన దేశంలో జరుగుతున్న పరిణామాలు, రాజకీయ పరిస్థితులపై అంతర్జాతీయ సదస్సు పెట్టి మరీ చర్చించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తున్నది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల ముందు భారత్‌ను తక్కువ చేసి చూపుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదంటూ రాహుల్‌గాంధీ ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు అదే ప్రచారాన్ని అంతర్జాతీయ సదస్సులో చర్చించనున్నట్టు తెలుస్తున్నది. ఈ సదస్సుకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ ముఖ్యులు హాజరై ప్రసంగించనున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సమావేశం కాకుండా ప్రభుత్వ సమావేశం ఎలా అవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**రూ.30 కోట్లకుపైగా ఖర్చు?**

భారత్ సమ్మిట్‌కు వంద దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తున్నట్టు సమాచారం. ఈ సదస్సును హెచ్ఐసీసీ నోవెటాల్ హోటల్‌లో నిర్వహించనున్నారు. దేశ, విదేశాల నుంచి వస్తున్న అతిథులకు స్టార్ హోటళ్లలో లగ్జరీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు రూ.30 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలున్నాయి. ఈ నిధులను మొత్తం తెలంగాణ సర్కారే భరిస్తున్నట్టు తెలిసింది. రైతులకు పరిహారం, రైతుభ రోసా, రుణమాఫీకి డబ్బుల్లేవంటున్న సర్కారు.. రాష్ట్ర ప్రజలకు ఉపయోగంలేని సదస్సుకు రూ.30 కోట్లు పెట్టి నిర్వహించడం ఏంటనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నీళ్లు, నిధులు, నియామకాల్లో సర్కారు విఫలం.. మాజీ మంత్రి హరీశ్‌రావు



**చట్టం హైదరాబాద్:** కాంగ్రెస్ సర్కారు 17 నెలల పాలనలో నీళ్ల వినియోగం, నిధుల సాధన, నియామకాల్లో విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా నీళ్లను కాపాడటంలో, ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్లను అడ్డుకోవడంలో విఫలమైందని ఎక్స్ వేదికగా విమర్శించారు. రూ.8,929 కోట్ల రుణ విముక్తి చేయకపోవడం సర్కారు పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీచేయడంలో విఫలమైందని విమర్శించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసుకోవాలి



**చట్టం /హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం దేశరాజుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న పలువురు లబ్ధిదారులను నిర్మాణ వివరాలను, ఇప్పటివరకు అయిన వ్యయం, పేమెంట్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణానికి సంబంధించి దశలవారీగా బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇల్లును మంచిగా నిర్మించుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి నాణ్యమైన మెటీరియల్ ను వినియోగించుకోవాలన్నారు. వర్షాకాలం నాటికి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా స్థిర నివాసం ఏర్పడుతున్నందుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఝాన్సీ రాణి, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఎంపీడీవో గుండె బాబు, తదితరులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

## రామారెడ్డి ఎస్ఐ సస్పెండ్...



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి ఎస్ఐ నరేష్ ను సస్పెండ్ చేస్తూ ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చట్టం దినపత్రికలో ప్రచురితమైన హత్య కేసు వార్త కు పోలీస్ ఉన్నత అధికారులు చర్య తీసుకున్నారు.రామారెడ్డి మండలం ఇస్సన్న పల్లి గ్రామానికి చెందిన బాధితులు ఫిర్యాదు చేసిన కేసులో అలసత్వం వహించిన రామారెడ్డి ఎస్ఐ నరేష్ ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గత వారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి ఎస్ఐ వెంకటేశ్వర్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేకపోతే చర్యలు తప్పవని కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర హెచ్చరించారు.

## ఉగ్రదాడిలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించిన వినయ్ రెడ్డి




**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండల కేంద్రంలో గురువారం రోజు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి కశ్మీర్ లో ఫహల్గం లో జరిగిన ఉగ్రదాడి మరణించిన పర్యాటకులకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ దాడికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి అని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి అగ్నివీర్ ద్వారా యువకులను ఆర్మీ లోకి తీస్కొని వృద్ధులను బయటికి పంపి తద్వారా ఈ దేశ భద్రత పెరుగుతుంది అని గొప్పలు చెప్పిన మోడీ ఇప్పుడు ఈ దేశ ప్రజలకి ఏం సమాధానం చెప్తారు అని అన్నారు. తన మిత్రులైన అదాని కి ఛత్తీస్గర్ లో విలువైన అడవి లోని ఖనిజ సంపదను కట్ట బెట్టడానికి ఆపరేషన్ కలర్ పేరు తో అక్కడ నివసిస్తున్న ఆదివాసులను చంపడానికి ఆర్మీ నీ అక్కడ మోహరించి, అత్యంత సున్నిత ప్రదేశమైన కశ్మీర్ లో భద్రతా దళాలను లేకుండా చేసి ఈ మరణాలకు కారణం అయ్యారనీ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నంది పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ ఎఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, నిజామాబాద్ ఎఎంసి డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏడ్డిగారి నిఖిల్, ఆర్మూర్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ అగర్వాల్, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిరాజి నాగరాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా సంఘానికి సహకారం అందజేస్తా...



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** క్రీడా సంఘానికి తన వంతు సహకారం అందజేస్తానని ప్రముఖ సంఘ సేవకుడు తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి అన్నారు. గురువారం నాడు కామారెడ్డి జిల్లా క్రీడా సంగం ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు రియల్ ఎస్టేట్ రంగంలో కామారెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ముందుండాలని ఆయన అన్నారు తాను కూడా కామారెడ్డి నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశానని గుర్తు చేశారు. కామారెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్ అసోసియేషన్ కు తన సంపూర్ణ సహకారం ఉంటుందని గుర్తు చేశారు అనంతరం అధ్యక్షుడు లక్ష్మీ నరస గౌడ్ మాట్లాడుతూ క్రీడా సంఘ భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన తోటి కార్యవర్గంతో ప్రతి నెలఓసారి సమావేశం నిర్వహించి సంఘం అభివృద్ధికి తోడ్పడుతుందని ఆయన అన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com